**PCW తెలుగు దినపత్రిక**

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 03 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 31 డిసెంబర్ 2025


### సమిష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యం




### సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం




## ప్రణాళికాబద్ధంగా

# నగరాభివృద్ధి

- చెత్త, కాలుష్య నివారణ అతిపెద్ద టాస్క్
- చెత్త ఏరివేతకు వారినికి మూడ్రోజులు స్పెషల్ డ్రైవ్
- ప్లాస్టిక రహిత నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు
- నాలాలు, చెరువుల ఆక్రమణలు కాకుండా చూడాలి
- జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు
- గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్‌కు మారాలి
- జోనల్ కమిషనర్లకు సిఎం రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం



**హైదరాబాద్,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ఓఆర్ఆర్ లోపల ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ కొత్త జోనల్ కమిషనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. కొత్త జోనల్ కమిషనర్లతో సమావేశమైన సీఎం.. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొం దించుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మిగతా2లో...




## గ్రూప్-2 అభ్యర్థులకు

# బిగ్ రిలీఫ్

### - రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను కొట్టేసిన ఏపీ హైకోర్టు

**అమరావతి,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్ దక్కింది. గ్రూప్-2 రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. కాగా, 2023లో విడుదలైన గ్రూప్-2 మిగతా2లో...

## బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

### కంచె వేయకుండా మోకాలడ్డిన బెంగాల్ సిఎం

### ఘాటు విమర్శలు చేసిన కేంద్రహోంమంత్రి అమిత్ షా



**కోల్‌కతా,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత్ బంగ్లా సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి మమతా సర్కార్ అడ్డం పడుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల మిగతా2లో...




## బెంగాల్లో భూమి ఇవ్వడం వల్లనే ప్రాజెక్టులు వచ్చాయి

### - అమిత్ షా వ్యాఖ్యలపై మండిపడ్డ మమతా బెనర్జీ

## కెసిఆర్ అసెంబ్లీ చర్చకు

# వస్తారా?

- పాలమూరు-రంగారెడ్డిపై మాట్లాడుతారా..?
- రాజకీయ వర్గాల్లో సర్వత్రా ఇదే చర్చ
- 2న తిరిగి ప్రారంభం కానున్న అసెంబ్లీ

**హైదరాబాద్,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కెసిఆర్ తొలిరోజు అసెంబ్లీకి వచ్చారు. మళ్లీ వస్తారా అని అందరి అభిప్రాయంగా ఉంది. అసెంబ్లీలో ఆయన మాట్లాడితే చూడాలని కూడా చాలాంది అభిప్రాయంగా ఉంది. కెసిఆర్ మీడియా ముందుకన్నా, అసెంబ్లీలో తన వాణి వినిపించి ఆరోపణలకు సమాధానం చెప్పాలని కోరుకుంటున్నారు. 2న తిరిగి అసెంబ్లీ సమావేశం మిగతా2లో...






## తిరుమలలో వైకుంఠ

# ఏకాదశి సందడి

### అర్ధరాత్రి నుంచే ప్రత్యేక దర్శనాలు

### భారీగా తరలివచ్చిన ప్రముఖులు

### సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రుల దర్శనం

## యూరియా సరఫరా

# కొనసాగుతోంది

- రైతులు ఆందోళన చెందవద్దు
- 47.68 లక్షల సంచుల యూరియా నిల్వలు
- కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా



**హైదరాబాద్,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా కలెక్టర్లతో జరిగిన వీడియోకాన్ఫరెన్స్ లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇచ్చిన ఆదేశాలనుసారం అన్ని జిల్లాలలో ఆయా కలెక్టర్ల పర్యవేక్షణలో యూరియా సరఫరా చేపట్టారు. అదేవిధంగా మంత్రి సూచన మేరకు జెడి,ఎడిఎలను జిల్లా ప్రత్యేక అధికారిగా నియమించిన వ్యవసాయశాఖ డైరెక్టర్, వారు వారికి కేటాయించిన జిల్లాలలో పర్యటించి ప్రత్యక్షంగా యూరియా సరఫరాలను పర్యవేక్షించనున్నారు. రబీ సీజన్‌కు గాను కేంద్ర ప్రభుత్వం మిగతా2లో...

## తెలంగాణ అసెంబ్లీ బిఆర్ఎస్ లీడర్ల

# నియామకం

### డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితా, తలసాని

### బిఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి

### ప్రకటన విడుదల చేసిన అగ్రనేత కెసిఆర్



**హైదరాబాద్,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ అధికార నాయకత్వంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గులాబీ పార్టీ అధ్యక్షుడు, అసెంబ్లీలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య నాయకులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లుగా ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్‌గా హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను ప్రకటించారు. వీరు అసెంబ్లీలో పార్టీ ప్రతినిధుల సహకారం, సభలో పార్టీ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. శాసనమండలిలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, సభ్యులను సభలో సక్రమంగా వ్యవహరించేలా చూసుకోవడం వీరి బాధ్యతగా మిగతా2లో...

## తెలంగాణలో అదుపులో

# శాంతిభద్రతలు

### క్రైమ్ రేటును బాగా తగ్గించగలిగాం

### పంచాయితీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాం

### ఫ్యూచర్ సిటీలో సమర్థంగా గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ

### మిస్ వరల్డ్ ఈవెంట్ కూడా సజావుగా నిర్వహించగలిగాం

### మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం

### 2025 వార్షిక నివేదిక విడుదల చేసిన డిజిపి శివధర్ రెడ్డి




**హైదరాబాద్,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఇయర్ ఎండింగ్ నేపథ్యంలో ఇవాళ (మంగళవారం) ప్రెస్ మీట్ నిర్వహించారు. 2025 ఏడాదికిగానూ పోలీసుల పనితీరుపై నివేదికను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని చెప్పారు. పోలీసులు ఎంతో సేవాభా వంతో పని చేస్తున్నారని, ప్రాణాలకు తెగించి శాంతి భద్రతలను రక్షిస్తున్నారని అన్నారు. 2025లో తెలంగాణలో 782 హత్యలు జరిగాయని, క్రైమ్ రేట్ 2.33 శాతం తగ్గిందని డీజీపీ తెలిపారు. ఈ ఏడాది 509 మంది మావోయిస్టులు లొంగిపోయారని వెల్లడించారు. మిగతా2లో...




## జలదోపిడీ జరుగుతున్న

# చలనం రాదా..?

### బనకచర్లపై ఫైల్లు కదులుతుంటే ఏం చేస్తున్నారు

### బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉద్యమ ద్రోహి, జలదోపిడి ద్రోహి అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైమాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు తెలంగాణకు ద్రోహి రేవంత్‌రెడ్డినే అని వ్యాఖ్యలు చేశారు. మిగతా2లో...

PCW తెలుగు దినపత్రిక

బుధవారం 31 డిసెంబర్ 2025

# తిరుమలలో వైకుంఠ ఏకాదశి సందడి

**తిరుమల,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలుగు రాష్ట్రాల్లో ముక్కోటి ఏకాదశి సందడి నెలకొంది. పలు దేవాలయాల్లో ఉత్తరద్వారాలు తెరుచుకోవడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి 12:05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. ఇప్పటికే శ్రీవారి కొండకు తరలివచ్చిన భక్తులు ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ, సినీ ప్రముఖులు ఉత్తర ద్వారం గుండా ఆ గోవిందుడిని దర్శించుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శ్రీవారిని దర్శించుకున్నారు. అనేక మంది రాజకీయ, సినీ ప్రముఖులు తెల్లవారుజామునే ఉత్తర ద్వారం గుండా శ్రీనివాసుడి దర్శనం చేసుకున్నారు.ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొండపల్లి శ్రీనివాస్, అనగాని సత్య ప్రసాద్, కొల్లు రవీంద్ర, సవిత, తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ, బాలకృష్ణ సతీమణి వసుంధర, నటులు రాజేంద్ర ప్రసాద్, నారా రోహిత్, శివాజీ, హీరోయిన్ శ్రీలీల, నటి హేమ, నిర్మాతలు డి.వి.వి దానయ్య, బండ్ల గణేష్, ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్, చాముండేశ్వరి నాథ్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్, కళ్యాణి, దువ్వాడ శ్రీనివాస్, మాధురి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజా, ఎంపీలు మిథున్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రాజాసింగ్, మల్లారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.



# ప్రణాళికాబద్ధంగా నగరాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశర చేశారు. క్యూర్ పరిధిలో సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా చేశాం. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని నిర్ణయించాం. జోనల్ కమిషనర్లు ప్రతిరోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందే. జోన్ల వారీగా సమస్యలు పరిష్కరించే బాధ్యత కమిషనర్లదే అని స్పష్టం చేశారు. నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ. నెలకు 3 రోజులు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. నగరగంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా చర్యలు చేపట్టాలి. క్యూర్ పరిధిలో డీజీల్ బస్సులు, ఆటోల స్థానంలో విద్యుత్ వాహనాలు తీసుకురావాలి. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నరెన్స్‌కు మారాలి. జనవరి నుంచి నాలాల పూడికతీత పనులు చేపట్టాలి. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు బాధ్యత తీసుకోవాలని సిఎం రేవంత్ ఆదేశించారు. మంచి ఫలితాలు రాబట్టాలంటే ..జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ - 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశంచేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. హైడ్రా, జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశర చేశారు. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ఎలాన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# యూరియా సరఫరా కొనసాగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రానికి వివిధ రకాల ఎరువులుగా మొత్తం 20.10 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించగా, అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నుండి అక్టోబర్ నెల నుండి ఇప్పటివరకు రాష్ట్రానికి 5.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఇప్పటికే 5.84 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు పేర్కొన్నారు. కేటాయించిన పరిమాణం కంటే 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అధికంగా జరిగిందని తెలిపారు. రబీ సీజన్‌లో ఇప్పటివరకు రైతులు 3.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేశారని, ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అంటే 47.68 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. రబీ సీజన్‌కు అవసరమైనంత యూరియా రాష్ట్రంలో పూర్తిగా అందుబాటులో ఉంది. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించిన మేరకు యూరియా సమయానుకూలంగా రాష్ట్రానికి చేరుతోందన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు విని, భయాందోళనకు గురయి అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, అవసరమైన మేరకే రైతులు వినియోగించుకోవాలి అని మంత్రి కోరారు. యూరియా అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా యూరియా నిల్వల వివరాలను వ్యవసాయ శాఖ విడుదల చేసిందని, అన్ని జిల్లాల్లో తగినంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులకు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఎరువుల సరఫరా వ్యవస్థను క్రమబద్ధంగా నిర్వహిస్తోందని, రబీ సీజన్ మొత్తం యూరియా కొరత తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు, రైతులకు అవసరం ఉన్నంత మేరకు యూరియా సరఫరా చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# కెసిఆర్ అసెంబ్లీ చర్చకు వస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

కానుంది. అయితే కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలకు హజరవుతారా లేదా అంటూ గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో జరుగుతున్న వేళ, సోమవారం మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చారు. కేవలం కొద్దిసేపు మాత్రమే ఉండి వెళ్లిపోయారు. ఆయనకు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. సోమవారం ఎట్టకేలకు శాసనసభలో వచ్చి కూర్చున్నారు. సభలోకి వచ్చిన కొద్ది నిమిషాలకే బయటకు వెళ్లిపోయారు. అయితే, ఆయన చర్య గులాబీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహాన్ని నింపింది. వెంటనే ఇలా వచ్చి అలా వెళ్లిపోయిన కేసీఆర్ తిరిగి కొత్త సంవత్సరం రెండో రోజు నుంచి జరిగే సమావేశాలకు వస్తారా? లేదా? అనే కొత్త చర్చ రాజకీయ వర్గాల్లో, సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. కేసీఆర్ తప్పకుండా సభకు వస్తారని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై మాట్లాడతారని బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగా నమ్ముతున్నాయి. ఎందుకంటే కెసిఆర్ వస్తారని, మాట్లాడుతారని గతకొంత కాలంగా హరీష్ రావు, కెటిఆర్ఉ చెబుతూ వచ్చారు. సోమవారం కేసీఆర్ శాసనసభకు రావడం ఖరారు కావడంతో అసెంబ్లీ ప్రాంగణంలో ఉదయమే పార్టీ ఎమ్మెల్యేలు ఆయనకు స్వాగతం పలికేందుకు వేచి ఉన్నారు. దాంతో అక్కడంతా హడావుడి కనిపించింది. బీఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తదితరులు కేసీఆర్‌కు స్వాగతం పలికారు. ఆయన మొదట అసెంబ్లీ లాబీలో తనకు కేటాయించిన ప్రతిపక్ష నేత ఛాంబర్‌లోకి వెళ్లారు. అక్కడే సభకు సంబంధించిన హాజరు నమోదు పత్రంలో సంతకం చేశారు. తర్వాత అసెంబ్లీ హాల్లోకి వెళ్లి కూర్చున్నారు. కొద్ది నిమిషాల్లోనే తన నివాసానికి బయలుదేరి వెళ్లారు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల అంశంపై చర్చ జరుపుదామని, కేసీఆర్ సభకు రావాలంటూ ఈ మధ్యకాలంలో అధికార పార్టీ నేతలు సవాల్ విసురుతున్నారు. ఈ నేపథ్యంలోనే జనవరి రెండు లేదా మూడో తేదీన కేసీఆర్ శాసనసభకు వస్తారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

# తెలంగాణ అసెంబ్లీ బిఆర్ఎస్ లీడర్ల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. విప్ బాధ్యతలు సభలో సభ్యుల హాజరు, అధికార పార్టీ నేతల ప్రతిస్పందనలను సమీక్షించడం, పార్టీ విధానాలను అమలు చేయడం వంటి కీలక అంశాలను కవర్ చేయనున్నారు. కేసీఆర్ తన అసెంబ్లీ నాయకత్వానికి మద్దతుగా మధుసూదనాచారీని బీఆర్ఎస్ ఎలోర్ లీడర్‌గా కొనసాగించారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తొలి ప్రతినిధిగా మధుసూదనాచారీని కొనసాగించడం ద్వారా పార్టీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాల అమల్లో కీలకంగా మారనుంది. కేసీఆర్ ప్రకటన బీఆర్ఎస్‌లో సభ్యుల కృషిని ప్రోత్సహించడమే కాకుండా, అసెంబ్లీలో పార్టీ స్థిరత్వాన్ని సుస్థిరంగా ఉంచడానికి దోహదపడుతుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మార్పుల ద్వారా సభలో సమన్వయంగా పనిచేయడం, విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి లక్ష్యాలను సాధించగలుగుతారని తెలిపారు. డిప్యూటీ ఎలోర్ లీడర్స్, ఉప నేతలు, విప్‌లు అందరికీ మార్గదర్శకత్వం అందించడం ద్వారా బీఆర్ఎస్ తెలంగాణ అసెంబ్లీలో మరింత ప్రభావవంతంగా వ్యవహరిస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కేసీఆర్ ప్రకటించిన కొత్త నాయకత్వ నిర్మాణం బీఆర్ఎస్ శక్తిని మరింత పెంచుతూ, అసెంబ్లీలో పార్టీ స్థానాన్ని బలంగా వినిపించేందుకు దోహదపడనుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్‌లో సభ్యుల కోసం సమర్థమైన నేతృత్వం, విధాన అమలు, సభలో సమన్వయం వంటి అంశాలు ఈ మార్పుల ద్వారా మరింత కీలకంగా మారుతాయని గులాబీ పార్టీ నేతలు చెప్పుకొచ్చారు.

# గ్రూప్-2 అభ్యర్థులకు బిగ్ రిలీఫ్

(మొదటి పేజీ తరువాయి)

నోటిఫికేషన్‌పై రిజర్వేషన్ల విధానాన్ని సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను పాటించాలని కోరుతూ అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. 2023లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను రద్దు చేసి, పాత నోటిఫికేషన్‌కు బదులు కొత్త నోటిఫికేషన్ జారీ చేయాలని అభ్యర్థులు కోరారు. రిజర్వేషన్ల పాయింట్లను సవాల్ చేస్తూ, ప్రభుత్వ నిర్ణయాలు సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణ జరిపిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను తిరస్కరించింది.

# బంగ్లా చొరబాట్లను ప్రోత్సహిస్తున్న మమత

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేక పోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమి కొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షా న్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్రం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని..రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.

# బెంగాల్లో భూమి ఇవ్వడం వల్లనే ప్రాజెక్టులు వచ్చాయి

**కోల్‌కతా,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):**బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ ఉంటే పహల్గాం, దిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియను ఇంత హడావిడిగా చేయడం కుట్ర కాదా అని అన్నారు.

# తెలంగాణలో అదుపులో శాంతిభద్రతలు

(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు, వరదల సమయంలో పోలీసులు సహాయక బృందాలతో సమన్వయంగా పని చేశారని చెప్పారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు.జాతీయ, అంతర్జాతీయ సభలను అడ్డంకులు లేకుండా జరుపుకున్నామని టీజీ పోలీస్ బాస్ చెప్పారు. ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ పర్యటన కూడా విజయవంతమైందని అన్నారు. తెలంగాణ స్టేట్ పోలీసింగ్‌లో టాప్ ప్లేస్‌లో ఉందని తెలిపారు. తెలంగాణ టూరిస్ట్ పోలీస్ విభాగం పెట్టామని, అందులో 80 మంది సిబ్బంది ఉన్నారని చెప్పారు.ఫీడ్ బ్యాక్ కోసం ప్రతి పోలీస్‌స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ పెట్టినట్లు డీజీపీ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుతోపాటు ఐబొమ్మ రవి కేసుపైనా ఆయన స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణలో ఉందని, ఈ కేసులో ఎవరి ప్రమేయం ఉన్నా వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. ఐబొమ్మ రవి కేసులో ఏం చేయాలో తమకు తెలుసని అన్నారు.2024తో పోలిస్తే 2025లో రోడ్డు ప్రమాదాల సంఖ్య 5.6 శాతం పెరిగిందని అన్నారు. అత్యాచారం కేసులు కూడా 2024తో పోల్చితే 2,945 నుంచి 2,549కి తగ్గాయని చెప్పారు. దోపిడీ కేసులు 703 నుంచి 512కు తగ్గాయన్నారు. అల్లర్ల కేసులు 324 నుంచి 186కు తగ్గాయని చెప్పారు. కిడ్నాప్ కేసులు 1525 నుంచి 1145కు తగ్గాయని చెప్పారు.

# జలదోపిడీ జరుగుతున్న చలనం రాదా..?

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..ఏపీ నిర్మిస్తోన్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్ట్‌కు సీడబ్ల్యూసీ అనుమతి వచ్చిందని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం లేకుండా సీడబ్ల్యూసీ ఎలా అనుమతి ఇస్తోందని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పుకొచ్చారు. ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని ఆక్షేపించారు హరీశ్‌రావు. మంత్రి ఉత్తమ్ అసెంబ్లీలో ప్రతిసారి బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే సరిపోతోందని విమర్శించారు. నీటి వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర పోతుందా.. నిద్ర పోతున్నట్లు నటిస్తుందా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తాను ఎటువంటి ఫేక్ రాజకీయాలు చేయడం లేదని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఎంత ధైర్యమని నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీ అనుమతి రద్దు చేయాలని ఢిల్లీలో ధర్నా చేద్దామని హరీశ్‌రావు సూచించారు.

# జివో 252తో జర్నలిస్టులకు అన్యాయం

## - మంత్రి పొంగులేటిని కలిసిన యూనియన్ నేతలు

## - అక్రిడిటేషన్ల గడువు మరో 2నెలలు పొడిగింపు

**హైదరాబాద్,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):**అక్రిడిటేషన్‌ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో 252తో తమకు అన్యాయం జరుగుతుందని డెస్క్ జర్నలిస్టులు గడిచిన వారం రోజులుగా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ క్రమంలో డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతూ.. టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్టీ నేతలు మంగళవారం సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటిని కలిశారు. డెస్క్ జర్నలిస్టులకు గతంలో లాగే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జీవో 252 ని సవరించాలని మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. స్పోర్ట్స్, కల్చరల్, ఫీచర్ ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఫెడరేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల వినతిపై మంత్రి పొంగులేటి కూడా సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రిపోర్టర్లతోపాటు డెస్క్ జర్నలిస్టులకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పడొద్దని ఆయన చెప్పినట్లు తెలిసింది. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని కూడా చెప్పినట్లు సమాచారం. జర్నలిస్టులకు ఇబ్బంది లేకుండా జీవో 252ను సవరిస్తామని మంత్రి చెప్పనట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే నోటిఫజకేషన్ త్వరాలో వెలువడనున్న తరుణంలో ఆలస్యం కాకుండా ప్రస్తుతం ఉన్న అక్రిడేషన్ల గడవును మరో రెండు నెలలు పెంచారు. సమాచారశాఖ ప్రకటన విడుదల చేసింది. ఫిబ్రవరి 28 వరకు గడువు పొడిగిస్తూ సమాచారశాఖ కమిషనర్ ప్రియాంక ప్రకటన విడుదల చేశారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తాని కలిసిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నాయకులు

**ఉప్పల్ డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాని కలిసిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోసుల విజయ్ కుమార్,గొల్లి కృష్ణయ్య, ఒంపు లక్ష్మయ్య, సిద్ధ గొని రాజు గౌడ్, సిపిఎం నాయకులు భీష్మచారి, జోనల్ కమిషనర్ కి ప్రజా సమస్యల పై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎర్రం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సమస్యల పై అనేక వినతి పత్రాలు ఇచ్చి చాలాకాలం అయినప్పటికీ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ముఖ్యముగా నాగోల్ మెట్రో స్టేషన్ రామంతపూర్ వైపుగల సర్వీస్ రోడ్డును పూర్తి చేయాలని, కెసిఆర్ నగర్ నుండి నాగోల్ మెట్రో స్టేషన్ వరకు గల సర్వీస్ రోడ్డును



బాగు చేయాలని, అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయని, సర్వీస్ రోడ్డుపై అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి వేరే దగ్గర నాటాలని, రోడ్ల పైన చెత్త డంపింగ్లను ఎత్తివేయాలని,చిన్న చెరువు నందు వాకింగ్ ట్రాక్ పునరుద్ధరించాలని,మరియు చెరువులో ఉన్న స్థలాన్ని విద్యార్థులకు ఆటస్థలంగా మార్చాలని, వినతి పత్రాన్ని అందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలపై వచ్చిన వినతి పత్రాలను పరిష్కరించాలని అధికారులకు తెలిపిన అధికారులు మాత్రం సమస్యల వైపు కూడా చూడటం లేదని, ఇచ్చిన పత్రాలను చెత్తబుట్టలో వేస్తున్నారా? ప్రజా సమస్యలపై స్పందించని అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ కి తెలిపామని తెలిపారు.

# న్యూ ఇయర్ వేడుకలకు డీజే అనుమతి లేదు

**● మద్యం సేవించి వాహనాలు నడపరాదు ● నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: తొర్రూర్ ఎస్సై ఉపేందర్**



**తొర్రూర్ ప్రతినిధి ,డిసెంబర్ 30(పీసీడబ్ల్యు న్యూస్):** తొర్రూరు మండలంలోని ప్రజలందరికీ పోలీస్ వారు హెచ్చరిక.లి న్యూ ఇయర్ వేడుకలలో భాగంగా ఎలాంటి డీజేలకు అనుమతి లేదు కావున ప్రజలు గమనించి సహకరించగలరు నిబంధనలకు విరుద్ధంగా డీజే లు నిర్వహించినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనబడును. మద్యం సేవించి వాహనాలు నడపరాదు డిసెంబర్ 31 మరియు జనవరి 1 రోజులలో తొర్రూరు ప్రాంతం అంతట డ్రంక్ అండ్ డ్రైవరు నిర్వహిస్తూ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుంది ప్రజలు ఎవరూ కూడా 31 డిసెంబర్ రాత్రి రోడ్లమీద కేకులు కట్ చేయడం గానీ బైకుల మీద ఓవర్ స్పీడ్ తో వెహికల్స్ నడపడం గాని చేయరాదు ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి లిరోడ్లపైన క్రాకర్స్ కాల్చడం వంటివి చేయరాదు డిసెంబర్ 31 అనేది ప్రతి సంవత్సరం వస్తుంది కానీ జీవితం కోల్పోతే మళ్ళీ రాదు . అందరూ ఈ విషయాన్ని గమనించగలరు ముఖ్యంగా యువత ఒక్కరోజు ఆనందం గురించి జీవితాన్నిపణంగా పెట్టకండి.అదేవిధంగా చైనా మాంజా ఉపయోగించడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాటిని నిషేధించడం జరిగింది. కావున చైనా మాంజా వినియోగించకూడదు అలాగే ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయి.

# ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి







**ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస పత్రాలు నగదు అందజేత**

**సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత**

**సత్తుపల్లి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉద్యోగులు విధి నిర్వహణలో ఇష్టంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సత్తుపల్లి డిపో మేనేజర్ ఊటుకూరి సునీత స్పష్టం చేశారు. మంగళవారం సత్తుపల్లి డిపో గ్యారేజ్ నందు ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలతో పాటు నగదును అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి గుర్తింపు తెచ్చుకునే విధంగా ప్రయత్నం చేయాలని ఆమె సూచించారు. ఉద్యోగులు కష్టముతో కాకుండా ఇష్టంతో పనిచేయాలని ఆమె సూచించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ ఎక్కువ ఆదాయం తెచ్చే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆమె ఉద్యోగులకు సూచించారు. సత్తుపల్లి డిపోలో నవంబర్ 2025 లో అత్యధిక ఆదాయం, అత్యధిక కేఎంపిఎల్ తెచ్చిన వారిని ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి నగదు పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాలు అందించడం జరిగింది. అత్యధిక ఆదాయం తెచ్చిన వారిలో ఎక్స్ప్రెస్ విభాగమునందు డి. యాదగిరి, ఎం నరేంద్ర, కే సైదులు, పల్లె వెలుగు విభాగం లో టీ.గోపి, టి.వి. రావు, పి. వి.సుబ్బారావు, డ్రైవర్ విభాగంలో వి.వి. రమణ, పి. రాజేష్, ఎస్వి రావులు ఉన్నారు. వీరితోపాటు అత్యధికముగా ఆయిల్ సేవ్ చేసిన డ్రైవర్ లు వి హనుమంతరావు, కే నరేష్ లను ఈ సందర్భంగా అభినందించి ప్రశంస పత్రాలను అందించారు. అసిస్టెంట్ మేనేజర్ పి విజయ శ్రీ, వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, ఏడీసీలు పి. అప్పారావు, బాల రావు, బాలస్వామి, కృష్ణారెడ్డి, కాంతారావు, టిఐ 3 కుద్దూస్, కిరణ్ బాబు వెంకటయ్య, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**● కురవి ఎస్సై గండ్రాతి సతీష్**



**కురవి డిసెంబర్ 30(పి.సి.డబ్ల్యూ న్యూస్):** నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా, బాధ్యతతో జరుపుకోవాలని కురవి ఎస్సై గంద్రాతి సతీష్ సూచించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ జారీ చేసిన అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.డిసెంబర్ 31న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కఠినంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన వాహన దారులకు ఎలాంటి ఉపేక్ష ఉండదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు అప్పగించరాదని, ఇది వారి ప్రాణాలకు ముప్పుగా మారుతుందని స్పష్టం చేశారు.రోడ్లపై బైక్ రేసింగ్లు, కేక్ కటింగ్లు, డీజే సౌండ్ వంటి కార్యకలాపాలు పూర్తిగా నిషేధమని తెలిపారు. మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, ప్రతి ఒక్కరి జీవితం అమూల్యమైనదని అన్నారు. ఒక్క క్షణపు నిర్లక్ష్యం కుటుంబాల భవితవ్యాన్ని ప్రభావితం చేయగలదని గుర్తు చేశారు.ప్రజలంతా పరస్పర గౌరవం, శాంతి భద్రతలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించాలని, పోలీసు శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని కురివి ఎస్సై గంద్రాతి సతీష్ కోరారు.

# సమిష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యం

**● జిల్లాలో పారిశ్రామిక, పని ప్రదేశాల్లో స్పెషల్ డ్రైవ్**



**హన్మకొండ,డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** పభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్య పడుతుందని కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు, ఆపరేషన్ స్మైల్ - 12 లో భాగంగా మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరెట్ పరిధి వరంగల్ హనుమకొండ జనగాం జిల్లాల అధికారులు పోలీసులు స్వచ్ఛంద సంస్థల ప్రతి నిధులతో సమన్వయ సమావేశం అదనపు డీసీపీ ఎన్ రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపి సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిబంధనల ప్రకారం జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ప్రమాదకర ప్రాంతాల్లో కార్మిక శాఖ,జిల్లా బాలల పరిరక్షణ విభాగం, కార్మిక శాఖ, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్, మరియు చైల్డ్ హెల్ప్ లైన్, స్మోప్, షేర్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అన్నారు.గత ఆపరేషన్ స్మైల్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా 339 బాలలను రెస్క్యూ చేసినామని, 26 ఎఫ్ఐఆర్ లు, 160 ఐఆర్ లు నమోదు చేశామని అన్నారు. పద్నాలుగు సంవత్సరాల లోపు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రకారం సంబంధిత యజమానుల పై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని, పద్దెనిమిది సంవత్సరాల లోపు బాల బాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం యజమానులపై కేసులు నమోదు చేయాలని అన్నారు. స్పెషల్ డ్రైవ్ విజయవంతం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే సాధ్యమవుతుందని, రోజు వారీ నివేదికలు కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారి ఆధ్వర్యంలో సేకరించి నివేదికలు అందజేయాలని అన్నారు, ఈ కార్యక్రమం లో యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్ యూనిట్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వినోద, ఎన్సిఎల్పి డైరెక్టర్ బుర్ర అశోక్ కుమార్, బాలల సంక్షేమ సమితి ఛైర్పన్ లు ఉప్పలయ్య, వసుధ, సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, జిల్లా బాలల పరిరక్షణ అధికారులు ఎస్ ప్రవీణ్ కుమార్, ఎల్ రవికాంత్, ఉమా, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్స్ ఎస్ భాస్కర్, కల్పన, రవికుమార్, ఎస్ఐ సుధాకర్, భాగ్యలక్ష్మి, సముద్దీన్ , పీసీ శ్రీనివాస్, రాము లు, సంస్థ ప్రోగ్రాం మేనేజర్ బత్తుల కరుణ, ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, మై ఛాయిస్ ఫౌండేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ జన్ను క్రాంతి, షేర్ స్వచ్ఛంద సంస్థప్రతినిధులు బి జమున,డివిజన్ ఎస్ఐ లు మరియు పోలీస్ సిబ్బంది, కార్మిక శాఖ అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# పెనుబల్లి తహసిల్దార్, జిపిఓలపై సస్పెన్షన్ వేటు

**పెనుబల్లి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :**

పెనుబల్లి మండల తాసిల్దార్ శ్రీనివాస్ యాదవ్, చింతగూడెం జిపిఓ బి. రవి లపై సస్పెన్షన్ వేడుపడింది. మండల పరిధిలో చింతగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 71/4 లోని 1.20 కుంటలు ప్రభుత్వ సీలింగ్ భూమిని జిపిఓ రవి ఇచ్చిన నివేదికను పరిశీలించకుండా ఇతరులకు డిజిటల్ సైన్ ని జిఎస్ చేసి పై అధికారులను తప్పుదోవ పట్టించే విధంగా ప్రభుత్వ భూమిని ఇతరులకు దారదత్తం చేసి నిర్లక్ష్యం చేశారని అట్టి విషయంపై విచారణ చేసిన అధికారులు జిల్లా కలెక్టర్ కి నివేదిక పంపించారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తాసిల్దార్ శ్రీనివాస్ యాదవ్, జిపిఓ బి రవి లను ఆరు నెలలు సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

# అధికారుల పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ వుండాలి

**● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**హన్మకొండ,డిసెంబర్ 30(పి.సి.డబ్ల్యూ న్యూస్):** స్టేషన్ అధికారులు, సిబ్బంది పని తీరుపై పోలీస్ ఉన్నతాధికారులు నిరంతం పర్యవేక్షణ వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ మంగళవారం సెంట్రల్ జోన్ కార్యాలయం ను తనిఖీ చేసారు. సెంట్రల్ జోన్ కార్యాలయమునకు చేరుకున్న పోలీస్ కమిషనర్కు సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీస్ గౌరవ వందనం చేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ ముందుగా సెంట్రల్ జోన్ సిసి కార్యాలయంను సందర్శించి ఇక్కడ సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై సిపి అరా తీయడంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో సిపి కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు చేయడం తో పాటు, రికార్డులన్ని ఎప్పటికప్పుడు అప్డేట్ పెట్టుకోవల్సి వుంటుందని తెలిపారు. తనిఖీల్లో భాగం డీసీపీ కార్యాలయము లో వరంగల్, హన్మకొండ, కాజీపేట్ డివిజన్ల సంబందించిన పలు రికార్డులతో పాటు, గ్రీవేన్స్ దరఖాస్తులు, రౌడీ షీటర్ల వివరాలతో శాఖ పరమైన ఫైల్లను పోలీస్ కమిషనర్ పరిశీలించడంతో సెంట్రల్ జోన్ పని తీరుపై పోలీస్ కమిషనర్ డిసిపి పలు సూచనలు, సలహాలు అందజేసారు. ఈ తనిఖీల్లో వరంగల్ ఏఎస్పీ శుభం, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, ట్రైనీ ఐపిఎస్ అధికారి మనిషా నేహ్రా పాల్గోన్నారు.

# సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం

**- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**హన్మకొండ,డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించు కోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు ప్రశాంత వంతమైన వాతవరణంలో ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించు కోనేందుకు పలు సూచనలు చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సోమవారం ప్రకటన విడుదల చేసారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలో స్థానిక పోలీసులతో పాటు ట్రాఫిక్, టాస్క్ఫోర్స్, క్రైమ్, షీ టీమ్స్తో పాటు పెట్రోలింగ్ విభాగాలకు చెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారు. ముఖ్యంగా ఈ వేడుకలను ప్రజలు అర్ధరాత్రి 12.30 గంటల లోపు ముగించుకోవాల్సి వుంటుందని ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఎర్పాటు చేసే సంస్కృతిక కార్యక్రమాలకు నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవడం తో పాటు, వేడుకలు నిర్వహించుకునే ప్రాంతం లో ఎలాంటి అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని అలాగే కార్యక్రమాల నిర్వహణ ప్రదేశంలో తప్పని సరిగా సిసి కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ సిబ్బంది ఎర్పాటు చేసుకోవాల్సి వుంటుందని ఈ వేడుకలు జరిగే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యల తో పాటు పరిసర ప్రాంతాల్లోని ఇండ్లవారికి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, వేడుకల్లో ఎలాంటి మత్తు పదార్థాల వినియోగించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని ప్రధానంగా ఈ వేడుకల వేళ యువకలు మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని. అలాగే వేగంగా వాహనాలు నడపడం, రోడ్లుపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురిచేసే వ్యవహరిస్తే సదరు వాహన దారులకు చట్ట పరమైన తిప్పలు తప్పవని, రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు రాకుండా ట్రాఫిక్ సిబ్బంది తో పాటు స్థానిక పోలీసుల అధ్వర్యంలో ట్రై సిటితో




పాటు, గ్రామీణ ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనీఖీలు నిర్వహించ బడుతాయని అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకోబడు తుందని పై అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కల్సి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించు కోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు.

## టిటియు జిల్లా అధ్యక్షునిగా కుల్ల రాజేందర్



**పెద్దపల్లి డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూన్యూస్):**తెలంగాణ టీచర్స్ యూనియన్ (టిటియు) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులుగా ముత్తారం మండలం పోతారం ప్రాథమిక పాఠశాల పనిచేస్తున్న కుల్ల రాజేందర్ ను నియామకం చేసినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మునగాల మహిపాల్ రెడ్డి,పొలంపల్లి ఆదర్శన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఈ సందర్భంగా కుల్ల రాజేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని, ప్రభుత్వానికి ఉపాధ్యాయుల గళాన్ని బలంగా వినిపించే విధంగా సంఘాన్ని ముందుకు నడిపిస్తానని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తెలంగాణ టీచర్స్ యూనియన్ కృషి చేస్తుందని ఆయన అన్నారు.అధ్యక్షునిగా తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులు, ఉపాధ్యాయులకు కుల్ల రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

## వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఉత్తర ద్వార దర్శనం



**గంగాధర డిసెంబర్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ ( పత్తి కుంట పల్లి). శ్రీ కోదండ రామచంద్రస్వామి దేవాలయంలో ఈరోజు వైకుంఠ ద్వార దర్శనము అంగరంగ వైభవంగా జరిగినది. భక్తులు పూలు, పండ్లు, కొబ్బరికాయలతో వచ్చి పల్లకి సేవ మరియు భజన కార్య క్రమంలో పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమానికి ఆలయ కమిటీ మరియు ఆలయ అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు.

## మహిళలకూ చీరలు పంపిణీ చేసిన సర్పంచ్



**గంగాధర డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంగంగాధర మండలంలోని కాసారం గ్రామ సర్పంచ్ వేముల జ్యోతి దామోదర్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఉపసర్పంచ్ చంద్రశేఖర్,వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సరిత మరియు మహిళలు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలో పలువురు ఎస్సైల బదిలీ

**ములుగు జిల్లా, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ కాళేశ్వరం జోన్-1 డీఐజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు తాడ్వాయి ఎస్సైగా జగదీశ్ విధుల్లో చేరగా తాడ్వాయిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ములుగు డీఆర్సీబీ ఎస్సైగా బదిలీ అయ్యారు పస్రా ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కమలాకర్ నార్లాపూర్ మేడారం ఎస్సైగా బాధ్య తలు స్వీకరించారు భూపాలపల్లిలో ఉన్న ఎస్సై తాజుద్దీన్ పస్రా ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు



## ఆపరేషన్ స్మైల్ - XII పోస్టర్‌ను ఆవిష్కరించిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్..



**మహబూబాబాద్ జిల్లా డిసెంబర్ 30(పి.సి.డబ్ల్యూ న్యూస్):** బాలల భవిష్యత్తును కాపాడే దిశగా "ఆపరేషన్ స్మైల్ - XII" కార్యక్రమా పోస్టర్ ను జిల్లా ఎస్పీ అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడం, పిల్లల రక్షణ, పునరావాసం మరియు వారి హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు ఎస్పీ తెలిపారు.జనవరి 1 నుండి 31, 2026 వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలోపోలీసు శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, విద్యాశాఖ, ఆరోగ్య శాఖ, చైల్డ్ లైన్ (1098), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీ టీమ్స్, భరోసా కేంద్రం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయనున్నాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,"ప్రతి బాలుడు గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉన్నాడు. బాలల చిరునవ్వును కాపాడటమే ఆపరేషన్ స్మైల్ యొక్క ప్రధాన లక్ష్యం. బాల కార్మిక వ్యవస్థపై రాజీ పడేది లేదు" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమ లక్ష్యాలు బాల కార్మికులను గుర్తించి రక్షించడం,బాధిత పిల్లలకు పునరావాసం కల్పించి విద్యలో చేర్చడం,బాలలపై జరిగే అక్రమ రవాణా, దోపిడీ, దౌర్జన్యాలను అరికట్టడం,ప్రజల్లో అవగాహన పెంపొందించడంప్రజలు ఎవరైనా బాల కార్మికులు లేదా పిల్లలపై జరుగుతున్న అక్రమాలను గమనిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 లేదా డయల్ 112 కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## రైతులు యూరియాను సద్వినియోగం చేసుకోవాలి

● మండలంలో యూరియా కొలత లేదు వెల్లడించిన తొర్రూర్ ఎమ్మార్వో శ్రీనివాస్



**తొర్రూర్ ప్రతినిధి,డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మార్వో శ్రీనివాస్. తొరూర్ మండలంలో యూరియా కొరత లేకుండా రైతులకు సరిపడా బస్తాలు అందుబాటులో ఉన్నాయని తాసిల్దార్ జి శ్రీనివాస్ వ్యవసాయ శాఖ అధికారి రామ నరసయ్య వెల్లడించారు, తాసిల్దార్ జి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ప్రవేట్ షాపులతోపాటు పిఎసిఎస్ నిర్వహించే సెంటర్లలో కూడా సరిపడా యూరియా బస్తాలు అందుబాటులో ఉంటుందని రైతులకు కావలసిన మేరకు వారి పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, వెంట తీసుకొని వెళ్లి బస్తాలు తీసు కోవచ్చని ఇక ముందు కూడా ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు, సాంకేతిక కారణాల వల్ల యాప్ పని చేయడం లేదని త్వరలోనే యాప్ అందుబాటులోకి వస్తుందని ప్రజలు యాప్ ద్వారానే బుక్ చేసుకుంటే ఏలాంటి ఇబ్బంది ఉండదని వారు సూచించారు, అదేవిధంగా యూరియా బస్తాలు ఎమ్మార్పీ రేట్ కు మాత్రమే అందుబాటులో ఉంటుంది అని తెలిపారు. తొర్రూర్ మండలానికి 100 టన్నుల యూరియా అవసరముందని ఉన్నత అధికారులకు విన్నవించడం జరిగిందని వారు కూడా సానుకూలంగా స్పందించి ఇకముందు కూడా యూరియా తీవ్రత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామ నర్సయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేర్చుకున్న విద్యను ఇస్లాం ధర్మ వ్యాప్తి కోసం ఉపయోగించండి

● యువ ఆలీమాలకు మౌలానా ఖారీ రషీద్ అహ్మద్ అజ్మెరి పిలుపు

● కరీంనగర్‌లో మదర్సా ఇస్లాహుల్ బనాత్ నిర్వహనలో ఖత్మే బుఖారీ ఆధ్యాత్మిక సదస్సు విజయవంతం








**కరీంనగర్ టౌన్ డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇస్లామిక్ మదర్సాలలో హాఫీజే ఖురాన్, ఆలీం కోర్సులను పూర్తి చేసుకున్న ముస్లిం విద్యార్థులు, తాము నేర్చుకున్న విద్యను ఇస్లాం ధర్మ అభివృద్ధికై, సమసమాజ శ్రేయస్సు కోసం పాటుపడేందుకు, ఇతరులకు విద్యాదానం చేయాలని గుజరాత్ కు చెందిన సుప్రసిద్ధ ఇస్లామీయ ధార్మిక పండితుడు మౌలానా ఖారి, రషీద్ అహ్మద్ అజ్మీరి ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. కశ్మీర్ గడ్డ లోని ఎమ్మార్ కన్వెన్షన్ లో ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో మదర్సా ఇస్లాహుల్ బనాత్ లో ఆలిం కోర్స్ ను విజయవంతంగా పూర్తిచేసిన యువతులకు, మహిళలకు ఖత్మే బుఖారీ చివరి పాఠ్యాంశాన్ని బోధించి, ఆలీం కోర్సును పూర్తి చేయించారు. ఈఆధ్యాత్మిక బహిరంగ సదస్సు (జల్సా) పెద్ద ఎత్తున విజయవంతం అయింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ బ్రాంచ్ గా.. మదర్సా ఇస్లాహుల్ బనాత్ బాలికలు, యువతుల కోసం కరీంనగర్ పట్టణంలో స్థాపించి ఆధ్యాత్మిక రంగంలో ఇస్లామిక్ విద్యలో అగ్రగామిగా నిలిచిందన్నారు. మదర్సా అరబియా హిఫ్జుల్ ఖురాన్ కరీంనగర్ ముస్లిం సమాజం సేవలో గత 40ఏండ్లుగా ఉన్నత స్థాయిలో సేవలు అందిస్తోందన్నారు. కరీంనగర్ ముస్లిం సమాజం ఆదరాభిమానాలతో, దాతల సహకారంతో, ఇతోధికంగా విరాళాలతో ఈ రెండు మదర్సాలు నిర్వహిస్తున్నామన్నారు. ఖురాన్ తర్వాత పెద్ద పుస్తకమైన ఖత్మే బుఖారీ కార్యక్రమానికి విచ్చేసిన వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో మదర్సా సిబ్బంది పాల్గొన్నారు.

## పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం





**గంగాధర డిసెంబర్ 30 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోఈ రోజు ఉదయం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమము మధురానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయములో నిర్వహించడం జరిగినది, ఇట్టి కార్యక్రమంలో తహశీల్దార్ రజిత మేడం, ఎంపీడీఓ దమ్మని రాము సర్, సర్పంచ్ వేముల భాస్కర్ గారు, ఐకేపీ ఏపీఎం, icds సూపర్ వైజర్, పోలీస్ సిబ్బంది,meo కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు,పంచాయతీ సెక్రెటరీ, హాస్టల్ వార్డెన్ మరియు ఇతర శాఖల సిబ్బంది, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు మరియు అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్, వినయ్ సాగర్ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు... ఇట్టి కార్యమమును ఉద్దేశించి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని తనం అనేది నిర్మూలించడం జరిగినదని, సమాజంలో పౌరులు అందరూ సమానమేనని,స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో కలిసి మెలిసి జీవించాలని, పౌరులు అందరూ చట్టాల పట్ల అవగాహన పెంచుకొని తధనుగుణంగా మేధలుకోవాలని, నడుచుకోవాలని,హొటల్ లో రెండు గ్లాసుల విదానంగాని, గుడిలోనికి ప్రవేశ విషయములో గాని వివక్ష చూపవద్దని అలా ఎవరైనా ప్రవర్తిస్తే చట్ట రీత్యా బాద్యులు అవుదురుని తెలియపరచ్చినారు.

## కరీంనగర్ బిజెపి కార్యకర్తకు వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని మోదీ...



**కరీంనగర్,డిసెంబర్30(పీసీడబ్ల్యూ న్యూస్):**కరీంనగర్ బిజెపి నాయకులు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ సోదరుడు శ్యామ్ వివాహం ఇటీవల జరిగింది. సోదరుడి వివాహ ఆహ్వాన పత్రికలను తోట సాగర్ భారతీయ జనతా పార్టీలోని ముఖ్య నేతలతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి పంపించారు. ఇట్టి వివాహ ఆహ్వాన పత్రికకు స్పందించిన ప్రధానమంత్రి మోదీ, కరీంనగర్ బిజెపి నాయకులు తోట సాగర్ సోదరుడు శ్యామ్, రాణి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ లేఖను పంపించారు. సోదరుడి వివాహ ఆహ్వానాన్ని మన్నించి, భారతీయ జనతా పార్టీలో సామాన్య కార్యకర్త కొనసాగుతున్న తనను గుర్తించి ప్రధానమంత్రి మోదీ వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ లెటర్ పంపించడం సంతోషంగా ఉందని, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తోట సాగర్ చెప్పారు.

## హెచ్.పీ గ్యాస్ గోదాంలో బ్లాక్ దందాను ఆపాలి

● జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ డిమాండ్.



**చిట్యాల, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలోని హెచ్ పీ గ్యాస్ గోదాంకు టెండర్ వేయాలని అందులో జరుగుతున్న బ్లాక్ దందా ను ఆపాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారుహెచ్ పి గ్యాస్ గోదాం నిర్వాహకులు రూ. 875 గల గ్యాస్ మొద్దును వినియోగదారులకు షాపు వాళ్లకు అక్రమంగా రూ. 1000 నుండి 1100 వరకు అమ్ముకుంటున్నారని ఆరోపిస్తు వినియోగదారుల నుండి అక్రమంగా ఎక్కువ డబ్బులు వసూలు చేస్తూ వారిని మోసం చేస్తున్నారని తెలిపారు మండల పౌర సరఫరాల శాఖ అధికారి ఇదంతా జరుగుతున్న చూసి చూడనట్లుగా వ్యవహరించడంతో హెచ్ పీ గ్యాస్ గోదాం నిర్వాహకులు ప్రజలను దోచుకుంటున్నారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హెచ్.పీ గ్యాస్ గోదాం వాళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో. జిల్లా నాయకులు అంబాల అశ్వద్ధామ రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐజీ ప్లాట్ ధరలు తగ్గించాలి

● సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై విక్రమ్



**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం నగరం శ్రీరాం హిల్స్ లోని ఎల్ఐజీ ప్లాట్ కొనుగోలు ధర 11 లక్షల నుంచి 6 లక్షలకు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా సబ్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కి సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ... మొత్తం 126 ప్లాట్లను కొనుగోలుకు హౌసింగ్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చిందని, వెంటనే సవరణలు చేసి మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో వుండే విధంగా మరో నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్లాట్ ధర 11.25 లక్షలుగా ధర నిర్ణయం చేశారని, కానీ ఇంత ధర పెట్టి పేదలు, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసే పరిస్థితి లేదని తెలిపారు. అర్హులైన లబ్దిదారులకు ఇవి దక్కాలంటే వెంటనే ధర తగ్గించి కనీసం 6 లక్షలు ధర నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్, మంత్రి, హౌసింగ్ అధికారులు ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల 10వ తేదీ జరిగే లాటరీ కార్యక్రమాన్ని అడ్డుకుంటాం అని వై విక్రమ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.ఏ జబ్బర్, ఎస్కే మీరా సాహిబ్, ఉపేంద్ర, సిహెచ్ భద్రం తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగదు

## -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

### తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ (జర్నలిస్టు సంఘాల జేఏసీ)కి హామీ

**హైదరాబాద్ డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):**గతంలో ఇచ్చిన అక్రెడిటేషన్ కార్డుల కంటే అధికంగా ఇస్తామని, నిజమైన జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి చిన్న అన్యాయం జరగనివ్వబోమని సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తనను కలిసిన జేఏసీ నాయకులకు హామీ ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో జర్నలిస్టు సంఘాల జేఏసీ నాయకులతో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అతి త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, అందరి అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని మరో జీవో తెస్తామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. డెస్క్ పనిచేసే వారికి, ఫీల్డ్ లో పనిచేసే జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. మంత్రిని కలిసిన జేఏసీ కన్వీనర్లు కే.కోటేశ్వర్ రావు, అనంచిన్ని వెంకటేశ్వరరావు, మామిడి సోమయ్య, పులిపలుపుల ఆనందం, రావికంటి శ్రీనివాస్, గౌటి రామకృష్ణ, రాణా ప్రతాప్,



కీర్తి సంతోష్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. **బాక్స్:జేఏసీ డిమాండ్స్**1). రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252 మార్గదర్శకాలలోని అభ్యంతరాలను నోటిఫికేషన్‌కు ముందు సవరించాలి. 2) చిన్న వార్తాపత్రికలు, కేబుల్ ఛానెళ్లు మరియు వీ-ఛానల్ కాకుండా ఇతర వార్తాపత్రికలకు, ప్రతి జర్నలిస్టుకు వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి. 3). రెండు కార్డుల వ్యవస్థకు బదులుగా, డెస్క్ జర్నలిస్టులు కూడా అన్ని జర్నలిస్టుల మాదిరిగానే ఒకే అక్రిడిటేషన్ కార్డు వ్యవస్థను కొనసాగించాలి. 4). తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయింది. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు 15 సంవత్సరాల సీనియారిటీ నిబంధన అసంబద్ధం. దానిని తొలగించాలి. 6). కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి. 7) తెల్ల రేషన్ కార్డులను వెంటనే అందించాలి. 8). జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత విద్య మరియు ఉచిత వైద్యం వెంటనే అందించాలని సంబంధిత విభాగాలకు అధికారిక ఆదేశాలు జారీ చేయాలి. 9). జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు బీమా సౌకర్యాలు కల్పించాలి. 10). 60 సంవత్సరాలు నిండిన జర్నలిస్టులందరికీ నెలకు రూ. 12,000 పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి. 11)జర్నలిస్టులకు దేశవ్యాప్తంగా రైల్వే ఫ్రీ పాసులు కల్పించాలి. 12)దేశవ్యాప్తంగావెహికల్ టోల్గేట్ సౌకర్యం కల్పించాలి

# పశువుల నట్టల నివారణ మందుల పంపిణీ



**చిట్యాల, డిసెంబర్ 30 (పీసీడబ్ల్యు న్యూస్):** చిట్యాల మండల్ లోని గొర్రెలు మరియు మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు వేయడం జరిగినది . ఇట్టి కార్యక్రమాన్ని చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి - అంతులు , ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ గార్లచే పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యం లో ప్రారంభించడం జరిగినది. నట్టల నివారణ కార్యక్రమాన్ని చిట్యాల్ మండల గొర్రెల మరియు మేకల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ లక్ష్మి కోరడం జరిగినది. చిట్యాల ప్రాంతీయ పశువైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ వెంకన్న మాట్లాడుతూ నట్టల నివారణ మందులు త్రాగిపించుకోవడం వలన గొర్రెలు మరియు మేకల లో నత్తలు నుంచి జీవాలు రక్షణ తో పాటు ఆరోగ్యముగా, అధిక బరువు పెరగడం జరుగుతుంది అని ఉన్నారుఅసిస్టెంట్ డైరెక్టర్ వెంకన్న, వెటర్నరీ సర్జన్ అజయ్ అప్పని లతో పాటు పశు వైద్య సహాయ సిబ్బంది కవిత , దివ్య , కరుణాకర్ , రాజేందర్ రెడ్డి మరియు గొర్రెలు మరియు మేకల పెంపకం దారులు పాల్గొనడం జరిగినది.

# రైతుల కోసం వేసిన రోడ్డుపై కాంగ్రెస్ నేత కొలగని అనిల్ తప్పుడు ఫిర్యాదు, దుష్ప్రచారం...

**- అనిల్ తన రాజకీయాల కోసం అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు..**

**- వాస్తవాలను జిల్లా అధికారులకు తెలియజేశాం... -తప్పుడు ఫిర్యాదు ను అనిల్ వెంటనే వెనక్కి తీసుకోవాలి...**

**డిఆర్వోకు వినతి పత్రం సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడిన నగునూరు రైతులు.**



**కరీంనగర్ రూరల్,డిసెంబర్30(పీసీడబ్ల్యూ న్యూస్):** నగునూరు గ్రామంలో రైతుల రవాణా, రాకపోకల అవసరాల కోసం రోడ్డును నిర్మించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కు స్థానిక రైతులందరూ కలసి వినతి పత్రం సమర్పిస్తే, ఈజీఎస్ ద్వారా రోడ్డు నిర్మాణం చేయించారని, రైతులకు ఉపయోగపడే రహదారి విషయంలో కాంగ్రెస్ నేత కొలగని అనిల్ తప్పుడు ఫిర్యాదు చేసి, దుష్ప్రచారం చేయడం సరికాదని, అనిల్ చేసిన అసత్య ఫిర్యాదును వెంటనే వెనక్కి తీసుకోవాలని నగునూరు రైతులు డిమాండ్ చేశారు. మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ పై ఆరోపణలు చేసి, ప్రజావాణిలో కోలగని అనిల్ తప్పుడు ఫిర్యాదు చేశారని నగునూరు రైతులు మంగళవారం రోజున జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు వాస్తవ విషయాన్ని వివరించి, అనిల్ ప్రజావాణిలో తప్పుడు ఫిర్యాదు చేశారని జిల్లా రెవెన్యూ అధికారికి లిఖితపూర్వకంగా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నగునూరు రైతులు మీడియాతో మాట్లాడారు. కొలగని అనిల్ తన రాజకీయాల కోసం అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రైతుల మేలు కోసం రహదారి నిర్మాణం చేస్తే కాంగ్రెస్ నేత అనిల్ హర్షించాల్సింది పోయి మాజీ కార్పొరేటర్ కోలగాని శ్రీనివాస్ పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ రహదారి చుట్టుపక్కల ఉన్న రైతుల ప్రయోజనాలను కోలగని అనిల్ గుర్తించకుండా, కేవలం మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ లక్ష్యంగా తప్పుడు ఫిర్యాదు చేసినట్టు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. నగునూరు రైతుల కు అన్ని విధాల ఉపయోగపడే రహదారి విషయంలో తప్పుడు ఆరోపణలు చేసి ఫిర్యాదు చేసిన కొలగని అనిల్ వెంటనే ఫిర్యాదు ను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కలెక్టరు కలిసిన రైతులు పెంచాలా సీతారామరాజు, శ్రీనివాసరావు, పురుషోత్తం మల్లేశం, వేల్పుల శ్రీనివాస్, దాసరి భూపతి, మూల కృష్ణ రెడ్డి,యాస్వాడ జగదీష్, ఆ రెల్లి శ్రీనివాస్ గౌడ్, తిరుపతి గౌడ్, పూదారి రమేష్, మురహరి రావు, అలుస సత్యం, రవి, మల్లయ్య తదితర రైతులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# వైకుంఠ ఏకాదశి శుభవేళ స్వామివారి సేవలో హెచ్.ఎల్.సి చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి.

**సింహాద్రిపురం డిసెంబర్ 30 (పీసీడబ్ల్యు న్యూస్):**ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సింహాద్రి పురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా గోవిందుని దర్శించుకుని,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి,వేద ఆశీర్వచనం గావించారు. ఆ శ్రీనివాసుని కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని వారు ప్రార్థించారు.

# నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**• సీరోల్ ఎస్ఐ గండ్ర సంతోష్**




**సీరోలు డిసెంబర్ 30(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండల ఎస్ఐ గండ్ర సంతోష్ ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాంతియుతంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని పలు సూచనలు చేశారు.- డిసెంబర్ 31న జిల్లాలో డీజేలు నిషేధించబడ్డాయి.- నిబంధనలను ఉల్లంఘిస్తే పరికరాలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరం- మద్యం సేవించి వాహనం నడపడం నేరం.- వేగంగా నడిపితే కేసులు నమోదు చేసి జైలుశిక్ష విధిస్తారు.ఆస్తుల ధ్వంసం, మహిళలపై అసభ్య ప్రవర్తనకు కఠిన చర్యలు- ఇళ్లపై రాళ్లు విసిరినవారిపై, ప్రైవేట్ ఆస్తులు, వీధి దీపాలను ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటారు.- మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.లి బైక్ రేసింగ్, ట్రిపుల్ రైడింగ్ నిషేధంలి- బైక్ రేసింగ్ లేదా ముగ్గురు కలిసి ప్రయాణించిన వారిపై కేసులు నమోదు చేస్తారు. మాదక ద్రవ్యాలు, నిషేధిత మద్యం విక్రయాలపై చర్యలు- గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు.- మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికి మూసివేయాలి.- మైనర్లకు మద్యం అమ్మకాలు చేయరాదు.- ప్రభుత్వ ప్రాంగణాల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో మద్యం అమ్మిన వారిపై కేసులు నమోదు చేస్తారు.- మైనర్లు వాహనాలు నడిపితే వారిపై కూడా కేసులు నమోదు చేస్తారు. ప్రజల సహకారం అవసరం- పై నిబంధనల ఉల్లంఘన కనిపించిన వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎవరూ ఇబ్బంది పడకుండా, కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుత వాతావరణంలో నూతన సంవత్సరాన్ని జరుపుకోవాలని ఎస్ఐ జి. సంతోష్ సూచించారు.

# రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు

**• జిల్లాలో యాసంగి అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి**

**• కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాబాద్ , డిసెంబర్ 30 :(పి.సి. డబ్ల్యూన్యూస్):** జిల్లాలో ప్రస్తుత యాసంగి (రబీ) సీజన్ లో పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. యూరియా ఎరువుల పంపిణీపై మంగళవారం సాయంత్రం ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా ఎరువుల పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని సహకార సంఘాలు, సహా ఇతర కేంద్రాలలో జిల్లాకు సరిపడా, యూరియా, ఎరువులు అందుబాటులో ఉంచామని, పంట సాగు చేస్తున్న ప్రతి రైతుకు అందేవిధంగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ఎరువుల పంపిణీ కేంద్రాలలో ప్రతీ చోట కనీసం మూడు కౌంటర్లను నెలకొల్పి రైతులు వచ్చిన వెంటనే వారికి ఎరువులు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పంపిణీ కేంద్రాల వద్ద షామియానాలు, త్రాగునీరు,



ఏర్పాటు చేస్తూ, ఉదయం 6.00 గంటల నుండే పంపిణీ ప్రారంభం అయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో ఎక్కడ కూడా యూరియా, ఇతర ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తుగానే జిల్లా అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు తెప్పిస్తున్నామని అన్నారు. కోరిన వెంటనే ప్రభుత్వం రైతుల అవసరాలకు అనుగుణంగా పూర్తి స్థాయిలో యూరియా నిల్వలను జిల్లాకు కేటాయిస్తోందన్నారు. యూరియా ఎరువుల పంపిణీ ప్రక్రియను ప్రతిరోజూ తానే స్వయంగా పర్యవేక్షించడం జరుగుతోందని, పంపిణీలో లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కాగా పారదర్శకంగా, సాఫీగా యూరియా ఎరువుల పంపిణీ కోసం రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్ అందుబాటులోకి తెచ్చిందని, రైతు సోదరులు, డీలర్లు గూగుల్ ప్లే స్టోర్ నుండి ఈ యాప్ ను ఇన్ స్టాల్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులకు యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకునే విషయంలో ఇబ్బంది తలెత్తకుండా వ్యవసాయ, సహకార శాఖలతో పాటు ఇతర శాఖల సిబ్బందిని పంపిణీ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచుతామని అన్నారు. అదేవిధంగా ప్రతి యూరియా విక్రయ కేంద్రంలో యూరియా బుకింగ్ యాప్‌కు సంబంధించిన క్యూ.ఆర్ కోడ్‌ను స్పష్టంగా ప్రదర్శిస్తారని తెలిపారు. తద్వారా రైతులు సులభంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బంది జరగకుండా వారి అవసరాలకు సరిపడా యూరియాను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అయితే ఒకేసారి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో అవసరానికి సరిపడా మాత్రమే వినియోగించాలని కలెక్టర్ రైతులను కోరారు. ఎవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, దారి మళ్ళించడం వంటి అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, యూరియా పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపైనా చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

# వ్యక్తిపై దాడి చేసిన ఐదుగురి నిందితుల అరెస్టు: సిఐ మచ్చ శివ కుమార్

**హన్మకొండ, డిసెంబర్ 30 :(పి.సి. డబ్ల్యూన్యూస్):**అశోక హోటల్ లో వ్యాలెట్ పార్కింగ్ లో పని చేస్తున్న శ్యామ్ అనే వ్యక్తి ఈనెల 23 వ తారీకు రాత్రి 11 గంటలకి తన డ్యూటీ అయిపోయిన తర్వాత ఇంటికి వెళ్తుండగా రాగన్న దర్వాజా దగ్గర అర్ధ రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శ్యామ్ పై దాడి చేయగా అతనికి తీవ్ర గాయాలు కాగా అతనిని హాస్పిటల్లో చేర్పించగా అతను సీరియస్ గా ఉన్నాడని డాక్టర్లు తెలిపారు. వెంటనే శ్యామ్ భార్య మీనా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా




కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి 48 గంటల్లో నిందితులను గుర్తించి హత్య ప్రయత్నం కేసులో మంగళవారం వారిని రిమాండ్ కి తరలించడం జరిగింది అరెస్ట్ అయినా నిందితుల లో సంపతీ రాహుల్, వర్షిత్, పున్నం చందు, అన్వేష్ రెడ్డి మరియు ప్రణయ్ లు ఉన్నారు అరవింద్ పరారిలో ఉన్నాడని సి ఐ తెలిపారు నిందితులను గుర్తించి అరెస్టు చేసిన ఎస్ఐ కిషోర్ మరియు క్రైమ్ టీం రావుఫ్ తిరువర్ధన్ లను అభినందించారు.

# నూతన సర్పంచ్, ఉపసర్పంచ్‌కు ఘన సన్మానం

**• 1998-99 బ్యాచ్ మిత్రులు**





**చిట్యాల డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఏలేటిరామయ్య పల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ గా గెలుపొందిన 1998- 99 బ్యాచ్ కు సంబంధించిన తమ తోటి మిత్రుడు కొడారి అశోక్ గారిని అలాగే రామచంద్రపురం గ్రామపంచాయతీ ఉపసర్పంచిగా ఎన్నికైనటువంటి సిరిపురం నర్సింగం గార్లను కలిసి ఘనంగా సన్మానించారు అన్ని రంగాలలో ఉన్న మిత్రులతో పాటు మరి ఇప్పుడు రాజకీయ రంగంలోకి కూడా వచ్చిన తమతో పాటు చదువుకున్న మిత్రులు సర్పంచిగా మరియు ఉప సర్పంచ్ గా ఎన్నికవ్వడం పట్ల మిత్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు వారి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని గ్రామ ప్రజల మన్ననలు పొందాలని కోరడమైనది ఈ కార్యక్రమంలో మిత్రులు తాటిపల్లి శ్రీనివాస్.బాలవెని రాంబాబు.తూముల విజేందర్. ఈగ శ్రీధర్ బాబు. కోడెల అశోక్.గోల్కొండ మొగిలి.సాదా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ

**మహబూబాబాద్ ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** సీరోల్ మండలం చిలుక్కోయిలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రూపొందించిన గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న నూతన క్యాలెండర్‌ను మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బుడిగం లక్ష్మ నారాయణ ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "క్యాలెండర్ అనేది కేవలం తేదీలు తెలిపే పుస్తకం మాత్రమే కాదు. కాలాన్ని గుర్తుచేసే దర్పణం, కర్తవ్యాలను గుర్తు చేసే మార్గదర్శకం. ఈ క్యాలెండర్‌లో మన సంస్కృతి, సంప్రదాయాలు, ముఖ్యమైన జాతీయ దినోత్సవాలు, మహనీయుల జయంతులను పొందుపరచడం అభినందనీయం. ప్రతి



ఇంటికి ఉపయోగపడేలా రూపొందించడం నిజంగా ప్రశంసనీయం" అని అన్నారు.అలాగే ఈ క్యాలెండర్ రూపకల్పనలో కృషి చేసిన నిర్వాహకులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. రాబోయే నూతన సంవత్సరం అందరి జీవితాల్లో ఆరోగ్యం, శాంతి, అభివృద్ధి, విజయాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఊడుగుల వెంకన్న మాట్లాడుతూ, భవిష్యత్తులో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరిన్ని ప్రజాపయోగ కార్యక్రమాలు చేపట్టి గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో ఉప సర్పంచ్ సమత - సైదులు,వార్డు మెంబర్ సభ్యులు, ఊడుగుల నాగరాజు, పారేపల్లి వాల్మీకి, వర్రె మౌనిక - యాకయ్య, మేకల రజిత- బుచ్చి రాములు, పసలాది సుగుణ- ఉప్పలయ్య, మాజీ వార్డ్ మెంబర్ సభ్యులు బాలిన రవికుమార్, కార్యదర్శి యాకూబ్ పాషా, గ్రామ కాంగ్రెస్ నాయకులు ఊడుగుల ఉపేందర్, జాల లింగయ్య, వూడుగుల వీరన్న, వేల్పుల శ్రీను, బుర్ర వెంకన్న, పారేపల్లి పుల్లయ్య, మేకల రాంబాబు, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి: ఎస్ఐ వంశీధర్



**మహబూబాబాద్, ప్రతినిధి డిసెంబర్ 30 (పీసీడబ్ల్యు న్యూస్):** డోర్నకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామ ప్రజలకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలను ఎస్సై వంశీధర్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ యొక్క వేడుకలను ప్రజలు శాంతియుతంగా, క్రమబద్ధంగా నిర్వహించుకోవాలని సూచించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు.వేడుకల సమయంలో మద్యం సేవించి వాహనాలు నడపడం, బైక్ ర్యాలీలు, రోడ్లపై హంగామా చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు. పబ్లిక్ ప్రదేశాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా ప్రవర్తించి, తమ కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నూతన సంవత్సరాన్ని ఆనందంగా కానీ సురక్షితంగా జరుపుకోవాలని సూచించారు. ప్రజలు పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించి, కొత్త సంవత్సరాన్ని సంతోషంగా, శాంతియుతంగా స్వాగతించాలని కోరారు.

# ఖమ్మం కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరాలి

**అధికార కాంగ్రెస్ వైఫల్యాలే మన అస్త్రాల్లు**
**కార్యకర్తలే మన బలం.. ఎన్నికల్లో సత్తా చాటండి**
**బీజేపీ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు**

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరాలని, ఖమ్మం జిల్లాలో భారతీయ జనతా పార్టీని తిరుగులేని శక్తిగా మార్చడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్పొరేషన్ ముఖ్య నాయకుల సమావేశం నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు, రాష్ట్ర నాయకులు, నల్గొండ జిల్లా ఇంచార్జ్ సన్నీ ఉదయ ప్రతాప్ లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు నాయకుల్లో, కార్యకర్తల్లోని పోరాట పటిమను తట్టిలేపుతూ.. ఉద్వేగభరితమైన ప్రసంగం చేశారు. రానున్న ఎన్నికలు పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కాషాయ జెండాను రెపరెపలాడించడమే ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, కార్యకర్తలు తమ సత్తా ఏంటో చూపే సమయం ఆసన్నమైందని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. పార్టీ విజయంలో కార్యకర్తలదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం



చేయాలని సూచించారు. కార్యకర్తలు కేవలం పార్టీ జెండా మోసేవారు మాత్రమే కాదని, వారు పార్టీకి వెన్నెముక వంటివారని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కీలక భూమిక పోషించి, వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయాన్ని కైవసం చేసుకోవాలని కోరారు. బూత్ స్థాయి నుంచే పార్టీని పటిష్టం చేసుకోవాలని, ప్రతి ఓటరును కలిసి బీజేపీ ఆవశ్యకతను వివరించాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్లదీస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని, కాంగ్రెస్ మోసపూరిత విధానాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను, వారి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో బీజేపీ కార్యకర్తలు ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను, అసమర్థ పాలనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, వారిని



చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత మనపై ఉందని కార్యకర్తలకు హితబోధ చేశారు. అదే సమయంలో, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కొనియాడారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి యజ్ఞాన్ని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అవినీతి లేని పాలన, అభివృద్ధి బాటలో పయనిస్తున్న భారతీయ జనతా పార్టీ మాత్రమే దేశానికి, రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఖమ్మం నగరాభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు వివరించి, అభివృద్ధి నినాదంతో ఎన్నికల క్షేత్రంలోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, రానున్న రోజుల్లో ఖమ్మం కార్పొరేషన్‌లో బీజేపీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, నాయకులు మందడపు సుబ్బారావు, దుద్దుకూరి వెంకటేశ్వరరావు, గంట్యాల విద్యాసాగర్, ఒక్కలంక సుబ్రహ్మణ్యం, సుదర్శన్ మిశ్రా, వీరల్లి రాజేష్ గుప్త, రజినీ రెడ్డి, అనిత, జ్వాల నరసింహారావు, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**• పోలీస్ కమిషనర్ సునీల్ దత్**



**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ... డిసెంబర్ 31 రాత్రి జాతీయ రహదారి, ప్రధాన రహదారులపై వేడుకలు నిషేధించబడ్డాయని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడపవద్దని, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లిదండ్రులను క్షోభకు గురిచేయవద్దన్నారు. మద్యం దుకాణదారులు నిర్ణీత సమయం వరకే విక్రయాలు చేయాలన్నారు. అర్ధరాత్రి గుంపులు గుంపులుగా తిరుగుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకునేలా స్నేహపూర్వక వాతావరణంలో శుభాకాంక్షలు తెలుపుకోవాలని విద్యార్థులు, యువతకు సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ 'షీ టీమ్స్' ప్రత్యేకంగా పర్యవేక్షణ చేపడతాయని స్పష్టం చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్, షీ టీమ్స్, పెట్రోలింగ్ బృందాలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తాయని తెలిపారు. డీజేలకు అనుమతిలేదని, బాణసంచా కాల్చడంపై నిషేధం ఉంటుందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడతామని, డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. బార్లు, వైన్ షాపులు నిర్దేశిత సమయానికి మూసివేయాలని, మైనర్లకు మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రెస్టారెంట్లు, షాపుల పరిసరాల్లో సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని సూచించారు. అసభ్యకర డాన్స్ కార్యక్రమాలు నిర్వహించరాదని హెచ్చరించారు. డ్రంకెన్ అండ్ డ్రైవింగ్ పరీక్షలు కట్టుదిట్టంగా అమలు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్ధరాత్రి యువకులు నిర్లక్ష్యంగా అధిక వేగంతో వాహనాలు నడపకుండా, బైక్ రేసులు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగుతుందన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం




**హన్మకొండ,డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశం మంగళవారం హనుమకొండ సమీకృత జిల్లా కార్యాలయ భవనంలోని (కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్), సుబేదారి లో జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబరీష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించ బడింది. ఈ సమావేశానికి ముందు జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు స్నేహ శబరీష్, రెడ్ క్రాస్ పాలక వర్గ సభ్యులతో కలిసి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జీన్ హెన్రీ డ్యూనాంట్ మరియు రక్తదాన ఉద్యమ పితామహులు (ఫాదర్ అఫ్ Blood డొనొర్స్) కార్ల్ ల్యాండ్ స్టైనర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా 2022%-23, 2023-%24 మరియు 2024%-%25 సంవత్సరాలకు సంబంధించిన వార్షిక నివేదికలు, ఆడిటెడ్ అకౌంట్లు, అలాగే రాబోయే సంవత్సరానికి ఆదాయ%-%వ్యయ అంచనాలను సర్వ సభ్యులకు వివరించారు.ఈ వార్షిక నివేదికను సోదా రామకృష్ణ ప్రతిపాదించగా, మండల పరశురాములు బలపరిచారు. అలాగే 2025%-%26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బండి సారంగపాణి ప్రతిపాదించగా, ఓరుగంటి లైలా బలపరిచారు. ఇందుకు సమావేశానికి హాజరైన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీకి నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న జిల్లా కలెక్టర్ కి పాలకవర్గ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సొసైటీ సేవాతత్పరతతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్థ అని, ప్రస్తుత పాలక వర్గం అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని ప్రశంసించారు. భవిష్యత్తు లో కూడా తన వంతు సహాయ సహకారాలు రెడ్ క్రాస్ సొసైటీకి అందిస్తానని హామీ ఇచ్చారు. శాశ్వత సభ్యులు మరింత ఉత్సాహంగా రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు సేవలందించాలని పిలుపు నిచ్చారు. అనంతరం రెడ్ క్రాస్ ప్యాట్రన్లను జిల్లా కలెక్టర్ మరియు పాలకవర్గ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. సర్వ సభ్య సమావేశానికి వచ్చిన పాటర్న్లు, జీవితకాల సభ్యులకు పాలకవర్గం కృత్షతలు తెలిపారు. ఈ సమావేశం లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా చైర్మన్ డాక్టర్ పి. విజయ చందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట్ నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డా. మాగంటి శేషు మాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా. కె. సుధాకర్ రెడ్డి, డా. సిహెచ్. సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ల రమణారెడ్డి, బాశెట్టి హరిప్రసాద్, రెడ్ క్రాస్ వైస్ ప్రెసిడెంట్ మరియు అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డీటీఓ ఎ. శ్రీనివాస్ కుమార్, టీజీవో ఏ. జగన్మోహన్ రావు, డాక్టర్ ప్రవీణ్ కుమార్, టీఎన్జీవో రాజేందర్, సోమన్న, రెడ్ క్రాస్ ప్యాట్రన్లు పొన్నాల రామ్ మోహన్, రావుల అనిల్ కుమార్, గండ్ర నరోత్తమ్ రెడ్డి, జి. వెంకట్ నారాయణ, శాశ్వత సభ్యులు నడెం శాంతి కుమార్, బోడ డిన్న, కుసుమ శ్యామ్ సుందర్, నేహాల్, యాకుబ్ రెడ్డి, మండల పరుశరాములు, కార్పొరేటర్ : మానస రాంప్రసాద్, తాడిశెట్టి విద్యాసాగర్, జి. రవీందర్, గోపాల్, పి. శ్రీనివాస్, ట్రాన్స్‌జెండర్ స్టేట్ ప్రెసిడెంట్ : లైలా, గుంటి స్వప్న, పూర్ణిమ రెడ్డి, రేష్మ, మరియు రెడ్ క్రాస్ సిబ్బంది, జీవితకాల సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**హన్మకొండ,డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తిరుమల శ్రీవారిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార ప్రవేశం చేసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వీరికి వేద పండితులు వేద ఆశీర్వదం అందించగా ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వైకుంఠనాథుడిని ఎంపీ డా.కడియం కావ్య వేడుకున్నారు.

# స్టూడెంట్ వెల్ నెస్ ప్రోగ్రాంతో వ్యక్తిత్వ వికాసం మెరుగుపడాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులా ల్లో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే స్టూడెంట్ వెల్ నెస్ కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం**



**హన్మకొండ,డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జిల్లా లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అన్ని సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించే స్టూడెంట్ వెల్ నెస్ కార్యక్రమంతో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం మెరుగుపరిచే విధంగా తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అన్ని సంక్షేమ గురుకుల విద్యాలయాల్లోని విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే స్టూడెంట్ వెల్ నెస్ కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల, కళాశాల నుండి ఇద్దరు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు స్టూడెంట్ వెల్ నెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో వ్యక్తిత్వ (మానసిక) వికాసాన్ని పెంపొందించే అంశాలను తెలియజేసేందుకు ఓరియంటేషన్ ప్రోగ్రాంను బుధవారం కలెక్టరేట్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో వికాసాన్ని పెంపొందించేందుకు అధికారులు ప్రశ్నావళిని రూపొందించాలన్నారు. ఫ్రెండ్లీ టీచర్స్ ను ఓరియంటేషన్ ప్రోగ్రాం కోసం అధికారులు ఎంపిక చేయాలన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలలో విద్యార్థుల ప్రవర్తనారీతుల పై అవగాహన ఉన్నవారిని ఓరియంటేషన్ ప్రోగ్రాం కు హాజరయ్యే విధంగా అధికారులు చూడాలన్నారు. స్టూడెంట్ వెల్ నెస్ పై శిక్షణ కార్యక్రమం జనవరి 5 వరకు జరుగుతుందన్నారు. ఐదో తేదీ నుండి అంతర్గతంగా విద్యార్థుల వ్యక్తిత్వ వికాస స్థాయిలను పెంపొందించుటకు తీసుకోవాల్సిన చర్యలపై, వారి వారి వ్యక్తిత్వ వికాసం మెరుగు పడిన అంశాలను మూల్యాంకనం చేసి భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, డీఐఈవో గోపాల్, విద్యా శాఖ సీఎంవో సుదర్శన్ రెడ్డి, డీడబ్ల్యూవో జయంతి, మైనారిటీ వెల్ఫేర్ అధికారి కె. ఏ. గౌస్ హైదర్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి ప్రేమకళ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, ఎంజెపీఎస్ డీసీవో ప్రసాద్,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్, బీసీ అభివృద్ధి అధికారి నరసింహ స్వామి, డిసివో ఉమా మహేశ్వరి,వివిధ పాఠశాల కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

**● సౌండ్ సిస్టం డిజేలు నిషేధం ● మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవు: ఎస్సై శ్రావణ్ కుమార్**



**చిట్యాల, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల ప్రజలందరికీ ముందస్తు నూతన సంవత్సర శుభకాంక్షలు. 2026 నూతన సంవత్సర వేడుకలు శాంతియుత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జరుపుకోవాలని చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్ శ్రావణ్ కుమార్ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మండల ప్రజలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందిగా తెలియజేశారుసౌండ్ సిస్టమ్స్ & DJపై నిషేధం: మండలంలో నూతన సంవత్సర వేడుకల కోసం DJలు మరియు భారీ సౌండ్ సిస్టమ్స్ ఉపయోగించడానికి అనుమతి లేదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.సాయంత్రం నుండి మండలం వ్యాప్తంగా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధించబడతాయి.అతివేగం మరియు నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికావద్దు. యువత బైక్ రేసింగ్‌లకు దూరంగా అన్నారు ఉండాలి. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసభ్యంగా ప్రవర్తించడం లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించే పనులు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.?ప్రజలందరూ పోలీసులకు సహకరించి, సురక్షితంగా మరియు సంతోషంగా కొత్త సంవత్సర వేడుకలను జరుపుకోవాలని చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలియజేశారు

# రామడుగులో పౌర హక్కుల దినోత్సవం



**రామడుగు డిసెంబర్ 30(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలోమంగళవారం పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని రెవిన్యూ శాఖఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ రాజేశ్వరి పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు పలు సూచనలు సలహాలు అందించారు.వార్డు సభ్యులు అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.సర్పంచ్ మొహమ్మద్ మొయి జ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆర్టికల్ 17 ప్రకారం అంటరాని తనం అనేది నిర్మూలించడం జరిగినదని, సమాజంలో పౌరులు అందరూ సమానమేనని,స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంతో కలసి మెలసి జీవించాలని, పౌరులు అందరూ చట్టాల పట్ల అవగాహన పెంచుకొని తధనుగుణంగా మేధలుకోవాలని, నడుచుకోవాలని,హోటల్ లో రెండు గ్లాసుల విదానంగాని, గుడిలోనికి ప్రవేశ విషయములో గాని వివక్ష చూపవద్దని అలా ఎవరైనా ప్రవర్తిస్తే చట్ట రీత్యా బాద్యులు అవుదురుని తెలియపరచ్చినారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ స్థానిక నాయకులు జి పి సిబ్బంది పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణ రంగంలో సరికొత్త విప్లవం



**'గ్రీన్ ఫార్చ్యూన్' యు పివిసి కిటికీలు, తలుపులు నూతన ఫ్యూచర్ లివింగ్ షాపును ప్రారంభించిన డిసిసిబి మాజీ అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, యువ నేత తుమ్మల యుగేందర్**








**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సొంతిల్లు అనేది ప్రతి ఒక్కరి జీవితకాల కల అంటారు. ఆ కలల సౌధాన్ని మరింత అందంగా, సురక్షితంగా మార్చేందుకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన 'యు పివిసి' కిటికీలు, తలుపుల తయారీలో 'గ్రీన్ ఫార్చ్యూన్' సంస్థ సరికొత్త ఒరవడిని సృష్టిస్తోందని మాజీ డిసిసిబి అధ్యక్షులు కూరాకుల నాగభూషణం, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, యువనేత తుమ్మల యుగేందర్ అన్నారు. ఖమ్మం నగరంలోని శ్రీ శ్రీ సర్కిల్లో ఏర్పాటుచేసిన నూతన ఫ్యూచర్ లివింగ్ షాపును మంగళవారం మాజీ డిసిసిబి అధ్యక్షులు కూరాకుల నాగభూషణం జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఫ్యూచర్ లివింగ్ షాపు యజమాని పాశం నవీన్ రాయ్ మాట్లాడుతూ.. ఐఐటి, ఐఐఎమ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల పూర్వ విద్యార్థుల సారథ్యంలో నడుస్తున్న ఈ సంస్థ, భారతీయ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులను అందిస్తోందన్నారు. గ్రీన్ ఫార్చ్యూన్ ఉత్పత్తులు కేవలం అందానికే కాకుండా, నాణ్యతకు, మన్నికకు మారుపేరుగా నిలుస్తున్నాయన్నారు. ?అధిక మన్నిక - 20 ఏళ్ల వారంటీ ఉంటుందన్నారు. రంగు వెలవకుండా ఉండేందుకు వీరు 20 ఏళ్ల కలర్ వారంటీని ఇస్తున్నామన్నారు. భారీ వర్షాలు కురిసినా నీరు లోపలికి రాకుండా ఉండేలా 'లీక్‌ప్రూఫ్' డిజైన్‌ను రూపొందించారన్నారు. అదేవిధంగా బయటి శబ్దాలు లోపలికి రాకుండా అలాగే వేసవిలో వేడి తగ్గించేలా వీటిని డిజైన్ చేశారన్నారు. దొంగతనాల భయం లేకుండా ఉండేలా 'మల్టీ-పాయింట్ లాకింగ్' సిస్టమ్‌ను ఏర్పాటు చేశారన్నారు. **విభిన్న రకాల ఉత్పత్తులు :** కస్టమర్ల అవసరాలకు తగ్గట్టుగా వివిధ రకాల కిటికీలను గ్రీన్ ఫార్చ్యూన్ అందుబాటులోకి తెచ్చిందన్నారు. **స్లైడింగ్ విండోస్ :** ఆధునిక ఇళ్లకు సరిపోయేలా తక్కువ స్థలంలో ఎక్కువ సౌకర్యాన్నిచ్చేలా ఉంటాయన్నారు. **కేస్‌మెంట్ విండోస్ :** గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా క్లాసిక్ లుక్‌లో ఉంటాయన్నారు. **టిల్ట్ అండ్ టర్న్ :** సౌకర్యవంతంగా శుభ్రం చేసుకోవడానికి, గాలి కోసం రెండు రకాలుగా ఓపెన్ చేయవచ్చు. **ఫిక్స్‌డ్ విండోస్ :** ఇంటి లోపల నుండి బయటి ప్రకృతిని తిలకించేలా వీటిని రూపొందించారు. **వేగవంతమైన సేవలు :** మధ్యవర్తులు ఎవరూ లేకుండా నేరుగా కస్టమర్లకే సేవలు అందించడం ఈ సంస్థ ప్రత్యేకత. ఆర్డర్ ఇచ్చిన 15 రోజుల్లోనే డెలివరీ, ఇన్‌స్టాలేషన్ పూర్తి చేస్తామని సంస్థ ప్రతినిధులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అనుభవజ్ఞులైన ఇన్-హౌస్ టీమ్ ద్వారా కొలతలు తీసుకోవడం నుండి అమర్చడం వరకు ప్రతి దశలోనూ నాణ్యతను పాటిస్తున్నారు.ప్రస్తుతం ఖమ్మం, హైదరాబాద్‌తో పాటు దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాల్లో తమ సేవలను విస్తరిస్తూ, గ్రీన్ ఫార్చ్యూన్ నిర్మాణ రంగంలో నమ్మకమైన బ్రాండ్‌గా ఎదుగుతోందన్నారు. ఖమ్మం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఫ్యూచర్ లివింగ్ షాపును ఏర్పాటు చేశామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కూరాకుల వలరాజు తదితరులు పాల్గొన్నారు.

# దీనీ తాలిమీ బోర్డు అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్ ఖాన్



**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఉమ్మడి ఖమ్మం జిల్లా జమియత్ దీనీ తాలిమీ బోర్డు అధ్యక్షుడిగా ముఫ్తీ మహమ్మద్ అబ్దుల్ రవూఫ్ ఖాన్ ఖాస్మి ఎన్నికయ్యారు. బోర్డు రాష్ట్ర అధ్యక్షులు మౌలానా మహమ్మద్ అబ్దుల్ ఖవీ ముఖ్య అతిథిగా పాల్గొన్న సమావేశంలో జిల్లాలోని పలు దీనీ తాలీమ్ మదర్సా లకు చెందిన నిర్వాహకులు, కరస్పాండెంట్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ముఫ్తీ అబ్దుల్ ముజీబ్ సోహేల్ ఖాస్మి, ఉపాధ్యక్షులుగా మౌలానా మహమ్మద్ అబ్దుల్ అలీమ్ అత్హర్ రబ్బానీ, హాఫీజ్ మహమ్మద్ నజీర్ అహ్మద్, కోశాధికారిగా హాఫీజ్ నియమతుల్లా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో బోర్డు రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా ముఫ్తీ మహమ్మద్ జలాల్ ఉద్దీన్ ఖాస్మి, మౌలానా హిమాయతుల్లా హుసైనీ, మౌలానా మహమ్మద్ అబ్దుల్ గనీ రషాదీ, ముఫ్తీ మహమ్మద్ అబ్దుల్ అజీజ్ లఫ్జీ, ముఫ్తీ అబ్దుల్ రహ్మాన్, మహమ్మద్ మియా ఖాస్మి, మౌలానా జకరియా ఫహద్ తదితరులు పాల్గొన్నారు.

# చినిగిన చొక్కా, వేసుకున్న, ఒక చక్కటి పుస్తకం కొనుక్కో...



**ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు విద్య ఒక్కటే ఆయుధం**

**వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ నాయక్**

**హన్మకొండ, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లునావత్ నరేంధర్ నాయక్ అధ్యక్షతన విద్యార్థులకు విద్య విలువపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సామాజిక సేవకులు స్వర్ణ భారతి యూత్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పాలడుగుల సురేందర్ విచ్చేసి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలు శ్రద్ధగా చదువుకుని వృద్ధిలోకి రావాలని చదువుకు పేదరికం ఎప్పుడు అడ్డుకారాదని ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రాథమిక విద్యాభివృద్ధికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని వాటిని ఉపయోగించుకుని విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలు చిత్రలేఖనం నైపుణ్యత గల విద్యలో రాణించాలని, అలాగే సెల్ ఫోన్ వాడకం తగ్గించి జీవితంలో స్థిరపడే వరకు చదువుకున్న కొనసాగించాలని తప్పుడు మార్గాలు అనుసరించకుండా సన్మార్గంలో ఎన్ని కష్టాలు ఎదురైనా విద్య ఒక్కటే ప్రధాన ఆయుధంగా ముందుకు సాగాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్ నాయక్ మాట్లాడుతూ తాము చదువుకున్న కాలంలో ఇటువంటి సౌకర్యాలు లేకపోయినా కఠినమైన నిబంధనలు ఉన్నప్పటికీ శ్రద్ధతో ఓర్పుతో చదువుకొని ఉపాధ్యాయునిగా, కాకతీయ అక్షర దీపికలో ఉత్తమ ఎమ్మెల్యేగా, ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర అధ్యక్షునిగా, గురువుల సహకారంతో బాల్ బ్యాట్మెంటన్ కెప్టెన్ గా, భారతదేశానికి మొట్ట మొదటి అర్జున అవార్డు గ్రహీత పిచ్చయ్య తో సైతం వివిధ కార్యక్రమాలు చేయగలిగి మహిళల అక్షరాస్యత కోసం అనేక ఏళ్లు కృషిచేసిన సందర్భంగా నేటి బాలలే రేపటి పౌరులు గనుక బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన మార్గంలో అవకాశాలను వినియోగించుకొని అందరూ వృద్ధిలోకి రావాలని సూచించారు. చదువుకోవాలని కసి పెంచుకొని ఇతర అనవసరపు అలవాట్ల పట్ల మొగ్గు చూపకుండా విద్య వైపు అడుగులు వేసి అభివృద్ధి సాధించాలని తెలిపారు. విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో తాను ఎప్పుడు ముందుంటానని అన్నారు. అక్షిత జాతీయ తెలుగు దినపత్రిక హనుమకొండ ప్రతినిధి కోడిపాక శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చాక అనునిత్యం చదువుకునే లక్ష్యంతోనే ముందుకు సాగాలని ఇతర సమస్యలకు బానిసలు కావద్దని జీవితంలో గొప్పగా ఎదగాలంటే చదువు ఒక్కటే ఏకైక మార్గమని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు స్వామి,లక్ష్మీ, ట్రైనింగ్ టీచర్లు విద్యార్థిని విద్యార్థులు.సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వర్ధన్నపేట గిరిజన హాస్టల్ విద్యార్థిని మానస




**వర్ధన్నపేట, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన వర్ధన్నపేట గిరిజన హాస్టల్ విద్యార్థిని మానస, 72వ రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలలో కరీంనగర్ నందు అంబేద్కర్ స్టేడియంలో 34 జట్లు 33 జిల్లాల నుండి పాల్గొనగా అందులో వర్ధన్నపేట గిరిజన హాస్టల్ విద్యార్థిని మానస అత్యంత ప్రతిభ కనబరిచి వరంగల్ జట్టు మహిళలు మూడవ ప్లేసులో విజయకేతనం ఎగరవేయడం జరిగింది. అడిషనల్ జిల్లా కలెక్టర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వరంగల్ క్రీడాకారులు అభినందనలు తెలుపుటకు అనుమతి కోరడం జరిగినది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు అడిషనల్ కలెక్టర్ కలెక్టర్ ని కలుచుటకు అనుమతి ఇవ్వడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమం లో హెచ్ఎం రాందాస్ , హెచ్ డబ్ల్యు ఓ, ఎస్ కే యాకూబ్ ,పి టి శ్రీనివాస్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సుజాత మేడం, మాణిక్యం, బాలాజీ,కిరణ్ కుమార్ , సమ్మయ్య, భాస్కర్ రావు, నాగరాజు, గోపీచంద్, రవీందర్, ఏఎన్ఎం అనసూయ మేడం మానసను అభినందించడం జరిగింది.



PCW తెలుగు దినపత్రిక
బుధవారం 31 డిసెంబర్ 2025

# గెలిచే 'గుర్రాల'కే బి-ఫామ్

**● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ● కటౌట్లు చూసి టికెట్లు ఇవ్వం ● రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ నేతలతో సన్నాహక సమావేశం**

**● 32 వార్డుల్లోనూ కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కదలాలి ● అభివృద్ధి మన బ్రాండ్.. ప్రచారమే మన ఆయుధం ● వార్డుల వారీగా సమస్యల గుర్తింపు.. నిధుల మంజూరుకు మంత్రి హామీ**



**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాబోయే మున్సిపల్ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32 వార్డులకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం మంగళవారం రాత్రి ఖమ్మంలోని ఎస్.ఆర్. కన్వెన్షన్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. **ప్రజల్లో ఉండేవారికే ప్రాధాన్యం :** మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై మంత్రి కీలక ప్రకటన చేశారు. "కటౌట్లు పెట్టినంత మాత్రాన టికెట్లు రావు. ఎవరు ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడుతారో, ఎవరికి క్షేత్రస్థాయిలో ప్రజల ఆశీస్సులు ఉంటాయో వారికే బి-ఫాం అందుతుంది. గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంది. నా సొంత రక్తసంబంధీకులైనా సరే.. ప్రజల మద్దతు ఉంటేనే టికెట్ వస్తుంది" అని స్పష్టం చేశారు. ఏదులాపురంలోని 32 వార్డుల్లోనూ విజయం సాధించడమే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. **అభివృద్ధిని ఇంటింటికీ చేరవేయండి :** ప్రభుత్వం గడిచిన రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించాలని మంత్రి సూచించారు. "ఏదులాపురం పరిధిలో ఒక్క ఉపాధి హామీ పథకంతోనే రూ. 100 కోట్ల నిధులు తెచ్చాం. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రతి ఇంటికీ మేలు చేశాయి. ఈ అభివృద్ధిని సోషల్ మీడియా ద్వారా, వ్యక్తిగత ప్రచారం ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. చేసిన పనిని చెప్పుకోవడంలో మనం వెనకబడకూడదు" అని పేర్కొన్నారు. **వార్డుల వారీగా ప్రణాళిక :** ప్రతి వార్డులో పెండింగ్‌లో ఉన్న చిన్న చిన్న సమస్యలను (రోడ్ గ్యాప్‌లు, డ్రైనేజీలు, పైప్‌లైన్లు) గుర్తించి వెంటనే అధికారులకు జాబితా ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే ఆ పనులన్నీ పూర్తి చేసేలా నిధులు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. "ఇళ్ల స్థలాల విషయంలో పేదలకు అన్యాయం జరగకుండా నాయకులు పర్యవేక్షించాలి. ఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యత నాది" అని హామీ ఇచ్చారు. ఈ సన్నాహక సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, నాయకులు తుంబూరు దయాకర్ రెడ్డి, చావా శివరామకృష్ణ, బేబీ స్వర్ణకుమారి, దొబ్బల సౌజన్య, హరినాథ బాబు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయతో చివరివరకు పోరాడితేనే విజయం

**● క్రీడలు మనిషిలోని నైపుణ్యతను, క్రీడాస్ఫూర్తిని చాటుతుంది**

**● విజయ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ లీగ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**





**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** క్రీడలలో ముందుకు సాగాలంటే టీం వర్క్ చాలా ముఖ్యమని, జట్టులో క్రీడాకారుల సమన్వయంతోనే విజయం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కొణిజర్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల మైదానం నందు నిర్వహిస్తున్న ఈతరం క్లబ్, ఈనాడు ఆధ్వర్యంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ క్రికెట్ లీగ్ 2025' ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల ముంగిపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఫైనల్ పోటీలలో సీనియర్ విభాగంలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల, ఖమ్మం ఎస్ఆర్బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ విభాగంలో హార్వెస్ట్ జూనియర్ కళాశాల, కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టులకు విభాగాల వారిగా విజేతలకు, రన్నరఫ్ జట్టులకు ట్రోఫీలను జిల్లా కలెక్టర్ ప్రధానం చేసి, ప్రోత్సాహక బహుమతులను క్రీడాకారులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. యువతకు క్రీడల పట్ల మరింత అసక్తి పెరగాల్సిన అవసరం ఉందని, క్రీడల వల్ల సమయస్ఫూర్తి, ఐకత్య నేర్చుకుంటామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నైపుణ్యం గల క్రీడాకారులు బయటకు రావాలని ఆకాంక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఖమ్మం నగరంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు. క్రీడల ద్వారా జీవితంలో ముఖ్యమైన పాఠాలు నేర్చుకోవచ్చని, స్వీయ నియంత్రణ, టీం స్పిరిట్, ఓటమి నుంచి కోలుకొని విజయం వైపు కొనసాగడం వంటి అనేక మంచి గుణాలు నేర్పిస్తుందని అన్నారు. ప్రతి రోజు కొంత సమయం క్రీడలకు కేటాయించాలని కలెక్టర్ సూచించారు. మానసిక ఉల్లాసం, శారీరక ఎదుగుదలకు దోహదపడే క్రీడలను మన జిల్లాలో ప్రోత్సహించడం సంతోషంగా ఉందని అన్నారు. ఖమ్మం నగరంలో కనీస సౌకర్యాలతో పాటు పిల్లలకు క్రీడలు ఆడుకునేందుకు వసతుల కల్పన చేస్తున్నామని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, భవిష్యత్తులో ఖమ్మం నుంచి మంచి క్రీడాకారులు వస్తారని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొణిజర్ల తహసీల్దార్ అరుణ, ఉషాకిరణ్, రవిమారుత్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ

**ఖమ్మం రూరల్ మండలాన్ని బాల్య వివాహ రహితంగా మార్చుదాం**

**ఎయిడ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కె శ్రీనివాస్**








**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం రూరల్ మండలాన్ని బాల్యవివాహ రహితంగా మార్చుదానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎయిడ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సత్యనారాయణ పురం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల నందు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోళ్ళపాడు నందు, గొల్లపాడు సెక్టార్ అంగన్వాడి టీచర్లకు బాల్యవివాహాల నిర్మూలనకై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలను 2030 నాటి కల్లా జిల్లాలో పూర్తిగా నిర్మూలించడానికి గత రెండున్నర సంవత్సరాలుగా సంబంధిత ప్రభుత్వ శాఖల సహకారంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ బాల్ వివాహ ముక్త్ భారత్ లో భాగంగా వందరోజుల ప్రచార కార్యక్రమాన్ని ఇటీవల కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు అన్నపూర్ణాదేవి విజ్ఞాన్ భవన్ ఢిల్లీ నందు ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు జరుగుతుందని దానిలో భాగంగానే ఖమ్మం రూరల్ మండలంలో బాల్య వివాహాలు వ్యతిరేకంగా ప్రతిజ్ఞలు చేయించడం జరుగుతుందని తెలిపారు. బాల్య వివాహాలు అనేవి బాలికల యొక్క విద్య, ఆరోగ్యం, జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని అంగన్వాడీ టీచర్లు కిశోర బాలికలకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలను చట్టపరంగా తీసుకునే చర్యలను తెలియజేయడం ద్వారా బాల్యవివాహాలను నిర్మూలించవచ్చు అని అన్నారు. వందరోజుల ప్రచార ఉద్యమంలో ప్రజలు, ప్రభుత్వ అధికారులు యువత ఇలా ప్రతి ఒక్కరు సహకరించాలని తద్వారా బాల్య వివాహాలులేని ఖమ్మం జిల్లాను 2030 లోపే చూడవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, బాలబాలికలు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఎయిడ్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కే శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, గోళ్ళపాడు సెక్టార్ అంగన్వాడీ టీచర్లు, కేజీబీవీ స్పెషల్ అధికారిని అస్మ, గోళ్ళపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగదు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**● మంత్రిని కలిసిన తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ**



**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో గతంలో ఇచ్చిన మీడియా అక్రెడిటేషన్ కార్డుల కంటే అధికంగానే ఇస్తామని, నిజమైన జర్నలిస్టులకు తమ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అక్రిడిటేషన్ల జీవో 252 విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏదైనా పొరపాట్లు ఉంటే త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశమై సవరిస్తామని అన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ జర్నలిస్టు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ(టీజేఏ జేఏసీ) నాయకులు మంత్రి పొంగులేటిని కలిసి జీవో 252 సవరణతో పాటు జర్నలిస్టుల ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అతి త్వరలో అన్ని జర్నలిస్టు సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని,అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మరో జీవో తెస్తామని అన్నారు. డెస్క్ లో పనిచేసే వారికి, ఫీల్డ్ లో పనిచేసే జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలను అంచెలంచెలుగా అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక లకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 252 మార్గదర్శకాలలోని అభ్యంతరాలను నోటిఫికేషన్‌కు ముందు సవరించాలని, చిన్న పత్రికలు, కేబుల్ ఛానెళ్లతో పాటు ఎంపానల్మెంట్ కాకుండా ఉన్న ఇతర పత్రికలకు సంబంధించిన ప్రతి జర్నలిస్టుకు వారి సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని వారు కోరారు. రెండు కార్డుల వ్యవస్థకు బదులుగా, డెస్క్ జర్నలిస్టులకు కూడా జర్నలిస్టుల మాదిరిగానే ఒకే అక్రిడిటేషన్ కార్డు వ్యవస్థను కొనసాగించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయిందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు 15 సంవత్సరాల సీనియారిటీ నిబంధన అసంబద్ధమని, ఈ నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించిన వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని, జర్నలిస్టుల కుటుంబాలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని, ఇందుకు కోసం వెంటనే ఆయా విభాగాలకు అధికారిక ఆదేశాలు జారీ చేయాలని కోరారు.జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు బీమా సౌకర్యం కల్పించాలని,60 సంవత్సరాలు నిండిన జర్నలిస్టులందరికీ నెలకు రూ. పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని, జర్నలిస్టులకు దేశవ్యాప్తంగా రైల్వే ఫ్రీ పాసులు కల్పించాలని,అదేవిధంగా జర్నలిస్టుల వాహనాలకు టోల్ గేట్ ఫీజు నుంచి మినహాయింపు సదుపాయం కల్పించాలని వారు మంత్రిని కోరారు. మంత్రిని, కమీషనర్ ను కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్లు మామిడి సోమయ్య(టీడబ్ల్యూజేఎఫ్), కే.కోటేశ్వర్ రావు(ఏడబ్ల్యూజేఏ), అనంచిన్ని వెంకటేశ్వరరావు(టీజే ఎస్ఎస్), పులిపలుపుల ఆనందం(ఐఎఫ్ డబ్ల్యూజే), రావికంటి శ్రీనివాస్(డబ్ల్యూజేఐ), గౌటి రామకృష్ణ, రాణా ప్రతాప్, కీర్తి సంతోష్ రాజు తదితరులున్నారు.



# ఏదులాపురం మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం









**రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు**

**ఏదులాపురం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి**

**ఖమ్మం ప్రతినిధి, డిసెంబర్ 30 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఏదులాపురం మున్సిపాలిటీలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ లో ఏదులాపురం చెరువు నాలాపై రూ. 20.25 లక్షలతో చేపట్టనున్న కల్వర్ట్ నిర్మాణ పనులకు, సాయి గణేష్ నగర్ లోని ఎన్.ఎస్.పి. కాల్వపై రూ. 15.70 లక్షలతో చేపట్టనున్న కల్వర్ట్, పోలేపల్లి డబుల్ బెడ్ రూం కాలనీలో రూ. 25 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... నేడు ఏదులాపురం మున్సిపాలిటీలో 2 కల్వర్ట్ లు, డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో అవసరమైన సిసి రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎటువంటి వెనుకడుగు వేయకుండా చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో వందకు వంద శాతం ప్రతి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మారుస్తామని, దాంతో పాటు డ్రైనేజ్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి ఎక్కడ ఇబ్బందులు లేకుండా చేసి ఏదులాపురంను రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్ మున్సిపాలిటీగా తయారు చేస్తామని తెలిపారు. శాశ్వతంగా త్రాగునీటి తో సహా స్థానికంగా కావలసిన మౌళిక వసతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తున్నదని, పేదలకు సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుతో పాటు పాత రేషన్ కార్డులో పేర్లను చేర్చడం, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, పిల్లలకు మంచి విద్య అందించాలనే లక్ష్యంతో గురుకులాల్లో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని అన్నారు. రైతును రాజు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం వచ్చిన మొదటి 9 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయలు 25 లక్షల రైతన్నలకు చెందిన రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేశామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం మొదటి విడతలో నాలుగున్నర లక్షలు ఇండ్లు మంజూరు చేసిందని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తూ, ప్రతి సోమవారం నాడు లబ్ధిదారులు కట్టిన ఇంటి లెవెల్ ననుసరించి చెల్లింపులు చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో పాలేరు నియోజకవర్గంలో మరిన్ని కార్యక్రమాలు చేయడంతో పాటుగా ఏదులాపురం మున్సిపాలిటీలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తెలంగాణలోనే రోల్ మోడల్ మున్సిపాలిటీగా చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పోలేపల్లి డబల్ బెడ్ రూంల 56 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.